

"నిన్ను నువ్వు బలహీనుడిగా భావించడం గొప్ప పాపం."

RNI NO: APTEL/25/A4894

# ఉషశ్రీ
USHASRI తెలుగు దినపత్రిక

RNI NO: APTEL/25/A4894
ఉషశ్రీ USHASRI తెలుగు దినపత్రిక
సమస్యలతో ఒంటరిగా పోరాడకండి.
సమాచారం - సహకారం -
పరిష్కారం ఒకే చోట సంప్రదించండి
9295003377

సంపుటి : 1 | సంచిక : 163 | విజయవాడ | ఎడిటర్ : ఇలిపిళ్ళ మోహన్ | 26-09-2026 శనివారం | పేజీలు : 8 | వెల : రూ.2/-

VOLUME NO.1 | ISSUE NO. 163 | VIJAYAWADA | EDITOR : ILLIPILLA MOHAN | 26-09-2026 SATURDAY | PAGES. 8 | RATE. RS.2/-

## మళ్లీ రగులుతున్న జంతర్ మంతర్



న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలనే డిమాండ్ పై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. ఎన్నికల కమిషన్‌లో నిర్ణయాలు ఏకపక్షంగా సాగుతున్నాయని, ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలుగుతోందని ఆరోపిస్తూ దేశంలోని పలు నగరాల్లో కాంగ్రెస్ శ్రేణులు రోడ్లపైకి వచ్చి ప్రదర్శనలు చేపట్టాయి. వేల సంఖ్యలో కార్యకర్తలు తరలివచ్చి ఆందోళనల్లో పాల్గొంటోన్నారు.

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపు దేశవ్యాప్త నిరసనల కార్యక్రమాన్ని చేపట్టారు. సీఈసీ ఓట్ చోరీకి పాల్పడుతున్నారని, ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేస్తున్నారని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. గత 10 నెలల కాలంలో కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలపై తోటి కమిషనర్లు సుమారు 14 సార్లు లిఖితపూర్వకంగా తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారంటూ వెలువడిన నివేదికలు ఈ వివాదానికి బీజం వేశాయి. - 2వ పేజీలో



## ఏపీలో దసరా కానుకగా 'ఆడబిడ్డ' నిధి కింద రూ. 18,000?




అమరావతి: సామాజిక మాధ్యమాల్లో ప్రస్తుతం 'ఆడబిడ్డ నిధి' పథకానికి సంబంధించిన ఒక వార్త తెగ చక్కర్లు కొడుతోంది. రాబోయే దసరా పండుగ కానుకగా రాష్ట్రంలోని అర్హులైన మహిళల ఖాతాల్లో ప్రభుత్వం ఏకకాలంలో రూ.18,000 జమ చేయనుందనే ప్రచారం విస్తృతంగా సాగుతోంది. దీంతో ఈ పథకం ప్రయోజనాలు ఎప్పుడు అందుతాయా అని లబ్ధిదారులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**సూపర్ సిక్స్ హామీ.. ఆడబిడ్డ నిధి వివరాలు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రకటించిన 'సూపర్ సిక్స్' హామీల్లో 'ఆడబిడ్డ నిధి' పథకం ఒకటి. ఈ పథకం ముఖ్య ఉద్దేశం పేదరికంలో ఉన్న మహిళలకు ఆర్థిక చేయూతనివ్వడం. దీని ప్రకారం 18 నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగిన, దారిద్ర్యరేఖకు దిగువన (బీపీఎల్) ఉన్న అర్హులైన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఆర్థిక సాయం అందిస్తారు. ఈ లెక్కన ఏడాదికి మొత్తం రూ.18,000 లబ్ధిదారుల ఖాతాల్లో జమ కానుంది.

**దసరాకు రూ.18,000 జమ నిజమేనా?**

తాజాగా సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల ప్రకారం... ప్రభుత్వం ఈ ఏడాదికి సంబంధించిన మొత్తం రూ.18,000ల మొత్తాన్ని దసరా పండుగ సందర్భంగా ఒకే విడతలో లబ్ధిదారులకు అందించేందుకు కసరత్తు చేస్తోందని సమాచారం. పండుగ వేళ మహిళలకు పెద్ద ఉపశమనం కలిగించేలా ఈ నిర్ణయం తీసుకునే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. - 2వ పేజీలో

## మున్సిపల్ ఎన్నికలపై మంత్రి నారాయణ క్లారిటీ



అమరావతి: ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా స్థానిక సంస్థల మరియు మున్సిపల్ ఎన్నికల నిర్వహణపై గత కొంతకాలంగా ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియపై మంత్రి నారాయణ పూర్తి స్పష్టత ఇచ్చారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పలు పిటిషన్లపై న్యాయస్థానాల్లో ప్రస్తుతం విచారణలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. కొన్ని కీలక అంశాలపై కోర్టులు తీర్పులను రిజర్వులో ఉంచగా, మరికొన్ని పిటిషన్లపై వాదనలు కొనసాగుతున్నాయి. న్యాయపరమైన చిక్కులన్నీ తొలగి, కోర్టు నుండి పూర్తి క్లియరెన్స్ (అనుమతి) వచ్చిన వెంటనే ఏపీ వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు.మున్సిపాలిటీలు మరియు నగరపాలక సంస్థల పదవీకాలం ముగియడంతో ప్రస్తుతం అక్కడ అధికారుల పాలన కొనసాగుతోంది. అయితే, ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే వార్డుల పునర్విభజన, బిసి రిజర్వేషన్ల ప్రక్రియలపై అంతర్గత కసరత్తు పూర్తి చేస్తోంది. న్యాయస్థానాల నుంచి తుది ఉత్తర్వులు వెలువడగానే - 2వ పేజీలో

## రైతన్నలకు మంత్రి నాదెండ్ల గుడ్ న్యూస్



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో రైతన్నలకు శుభవార్త అందిస్తూ నవంబర్ ఒకటో తేదీ నుంచి ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్నదాతల కష్టాన్ని గుర్తించి ప్రభుత్వమే నేరుగా ధాన్యం కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్న తరుణంలో ఈ నిర్ణయం రైతుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతోంది.

**కొనుగోలు కేంద్రాల ఏర్పాటు మరియు లక్ష్యం**


రాష్ట్రంలో రైతులు ఎవరికీ ఇబ్బంది పడకుండా ఉండేందుకు మొత్తం రెండు వేల ఆరు వందల పంతొమ్మిది కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేశారు. ఈ ఏడాది సుమారు ముప్పై ఏడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వర్షాలు అలాగే వాతావరణ పరిస్థితులను బట్టి అవసరమైన మార్పులు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటారు.

**ఇరవై నాలుగు గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ**

ధాన్యం విక్రయించిన కేవలం ఇరవై నాలుగు గంటల వ్యవధిలోనే రైతులకు బిల్లులు చెల్లించేలా విధానం అమలు చేస్తున్నారు. ఎక్కడా దలారీలకు తావులేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు సాగుతాయి. అన్నదాతలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి సకాలంలో డబ్బులు అందేలా ప్రత్యేక బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తాయి.

### విశాఖలో విషాదం..

## ఆంధ్ర మెడికల్ కాలేజీ విద్యార్థిని ఆత్మహత్య



విశాఖపట్నంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఫైనల్ ఇయర్ చదువుతున్న శైలజ అనే వైద్య విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. రామ్‌నగర్‌కు చెందిన శైలజ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది.

**ఇంట్లోనే విషాద ఘటన**

శైలజ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో ఉరేసుకున్నట్లు సమాచారం. అనంతరం తల్లిదండ్రులు గమనించి వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే యువతి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు తెలుస్తోంది.

**పోలీసుల దర్యాప్తు**

ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువతి ఆత్మహత్యకు దారితీసిన - 2వ పేజీలో

### పోలీసులను ఘనంగా సత్కరించిన

## ఏపీ హోంమంత్రి అనిత



అమరావతి: విధి నిర్వహణలో అంకితభావం, క్రీడల్లో రాణించడం మరియు సామాజిక సేవలో ఆదర్శంగా నిలిచిన ముగ్గురు విశిష్ట పోలీసు సిబ్బందిని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత ఘనంగా సత్కరించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలోని తన స్వగృహానికి వారిని ప్రత్యేకంగా ఆహ్వానించి అభినందనలు తెలిపారు. అంతేకాకుండా, వారితో కలిసి భోజనం చేస్తూ వారి సేవలను అభినందించారు. పోలీసుల ప్రతిభను మరియు సేవా స్ఫూర్తిని గుర్తించి ప్రోత్సహించడం తన ప్రథమ కర్తవ్యమని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

**ఆరు స్వర్ణ పతకాలు సాధించిన మహిళా కానిస్టేబుల్ విజయకు ప్రశంసలు**

ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో - 2వ పేజీలో

## ఇథనాల్‌తో రైతులకు అదనపు ఆదాయం: గడ్కరీ



న్యూఢిల్లీ: రైతులు కేవలం పంటలను పండించే అన్నదాతలుగానే కాకుండా, దేశానికి ఇంధనాన్ని అందించే 'ఇంధన దాతలు'గా మారుతున్నారని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. మధ్యప్రదేశ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఇథనాల్ వాడకం పెరగడం వల్ల అన్నదాతల ఆర్థిక పరిస్థితి మెరుగవుతుందని పేర్కొన్నారు. ఇది వారి ఆదాయాన్ని రెట్టింపు చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన వివరించారు. పెట్రోలియం దిగుమతులపై తగ్గుతున్న భారం

ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగం దేశ భవిష్యత్తుకు ఎంతో అవసరమని గడ్కరీ నొక్కిచెప్పారు.

ఇథనాల్ వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా విదేశీ టెక్కెలపై, ముఖ్యంగా పెట్రోలియం దిగుమతులపై దేశం ఆధారపడే శాతాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ఆయన స్పష్టం చేశారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. - 2వ పేజీలో

## లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు



న్యూఢిల్లీ: గత కొన్ని సెషన్లుగా తీవ్ర హెచ్చుతగ్గులకు లోనవుతున్న దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో సానుకూల ధోరణితో లాభాల్లో ముగిశాయి. ఆసియా మార్కెట్ల నుండి వచ్చిన గ్లోబల్ సంకేతాలు, అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు కాస్త శాంతించడంతో మార్కెట్లలో మళ్లీ కొనుగోళ్ల జోరు కనిపించింది.

ఫలితంగా, రోజు చివరికి బెంచ్ మార్క్ సూచీలైన బిఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ రెండు - 2వ పేజీలో

# ఏపీలో దసరా కానుకగా 'ఆడబిడ్డ' నిధి కింద రూ.18,000?

మొదటి పేజీ తరువాయి

ఈ పథకం అమలు, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ, దరఖాస్తు విధానం, అర్హతలకు సంబంధించిన స్పష్టమైన మార్గదర్శకాలను ప్రభుత్వం త్వరలోనే విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నిబంధనలు వెలువడిన అనంతరమే నగదు జమ తేదీలపై, ఇతర వివరాలపై పూర్తి అధికారిక స్పష్టత రానుంది.

# మళ్లీ రగులుతున్న జంతర్ మంతర్

మొదటి పేజీ తరువాయి

ఈ ఆందోళనల నేపథ్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఢిల్లీలోని జంతర్ మంతర్ కు తరలివచ్చారు. జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్లకార్డులను ప్రదర్శించారు. చేతులకు సంకెళ్లట్ల వేసుకుని మరీ నిరసనల్లో పాల్గొన్నారు.

జ్ఞానేష్ కుమార్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, ఆయను అరెస్ట్ చేయాలని నినదించార. ధర్మేంద్ర ప్రధాన్ కు వ్యతిరేకంగా అభిజిత్ డిప్కే సారథ్యంలోని కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో మొన్నటివరకు వార్తల్లో నిలిచింది.. జంతర్ మంతర్.

ఇప్పుడు మళ్లీ అక్కడ అదే తరహా వాతావరణం నెలకొంది. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ఆందోళనలతో జంతర్ మంతర్ ఎరుపెక్కింది. పోలీసులు పలుచోట్ల బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. వారిని ఎక్కడికక్కడ అడ్డుకోవడానికి ప్రయత్నించారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే పరిస్థితులు.. పలు నగరాల్లో కనిపించాయి. జమ్మూ, గువాహటి, కోల్‌కతా, చండీగఢ్, పాట్నా సహా పలు నగరాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తంచేశారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మలను దహనం చేశారు.

# మున్సిపల్ ఎన్నికలపై మంత్రి నారాయణ క్లారిటీ

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ఎన్నికల సంఘంతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు చర్యలు తీసుకుంటామని మంత్రి వెల్లడించారు. ఈ ప్రకటనతో మున్సిపల్ పోరు కోసం ఎదురుచూస్తున్న రాజకీయ వర్గాలు మరియు అభ్యర్థులకు స్పష్టత వచ్చినట్లయింది.

### పోలీసులను ఘనంగా సత్కరించిన

# ఏపీ హోంమంత్రి అనిత

మొదటి పేజీ తరువాయి

అనకాపల్లి జిల్లాకు చెందిన మహిళా కానిస్టేబుల్ వి. విజయ అసాధారణ ప్రతిభ కనబరిచారు. పోటీల్లో ఏకంగా ఆరు స్వర్ణ పతకాలను కైవసం చేసుకుని అందరి ప్రశంసలు అందుకున్నారు. విధి నిర్వహణ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూనే, మరోవైపు క్రీడల్లోనూ అగ్రగామిగా నిలవడం ఎంతో స్ఫూర్తిదాయకమని హోంమంత్రి కొనియాడారు. ఈ సందర్భంగా విజయను ప్రత్యేకంగా సత్కరించి ఆమె భవిష్యత్తు ప్రయాణానికి శుభాకాంక్షలు తెలిపారు.

**సాంకేతిక నైపుణ్యంతో నేరాలను ఛేదించిన కానిస్టేబుల్ రాంబాబు అభినందన**

పాయకరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కీలక కేసుల దర్యాప్తులో టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగిస్తున్న కానిస్టేబుల్ రాంబాబును మంత్రి అనిత ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యంగా బైక్ చోరీల కేసులను గుర్తించడంలో 'ఐటీ కోర్ అనాలిసిస్' విధానాన్ని వాడి నిందితులను పట్టుకోవడంలో ఆయన చూపిన ప్రతిభ అద్భుతమని ప్రశంసించారు. నేర పరిశోధనలో ఆధునిక సాంకేతికతను జోడించడం ద్వారా కేసులను త్వరగా ఛేదించవచ్చని ఆమె అభిప్రాయపడ్డారు.

**అవయవదానంతో ఆదర్శంగా నిలిచిన డీఎస్పీ శ్రీనివాసరావు**

సమాజానికి ఆదర్శంగా నిలుస్తూ అవయవదానం చేసిన నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు గొప్ప మనసును మంత్రి అనిత ప్రత్యేకంగా కొనియాడారు. పోలీసు శాఖలో ఉంటూ ఇలాంటి మానవతా విలువలను చాటిచెప్పడం ఎందరికో స్ఫూర్తినిస్తుందని తెలిపారు. ప్రజా సేవలో ఎల్లప్పుడూ ముందుండే పోలీసు సిబ్బంది వెన్నంటి ఉండి వారిని ప్రోత్సహిస్తామని హోంమంత్రి భరోసానిచ్చారు. ఈ అపూర్వ క్షణాలకు సంబంధించిన ఫొటోలను ఆమె తన సోషల్ మీడియా ఖాతాలలో షేర్ చేయగా నెటిజన్ల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

# లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

మొదటి పేజీ తరువాయి

కూడా మెరుగైన లాభాలను నమోదు చేశాయి.

కొనుగోళ్ల మద్దతు: బ్యాంకింగ్, ఆటో, ఎనర్జీ మరియు క్యాపిటల్ గూడ్స్ రంగానికి చెందిన కీలక షేర్లలో భారీగా కొనుగోళ్లు జరగడం సూచీల లాభాలకు ప్రధాన బలంగా నిలిచింది.

మార్కెట్ విశ్లేషణ: గ్లోబల్ బాండ్ ఈల్డ్స్ పై ఒత్తిడి తగ్గడం మరియు డాలర్ ఇండెక్స్ స్థిరపడటం లాంటి సానుకూల అంశాలు ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని పెంచాయి.

కీలక స్థాయిలు: నిఫ్టీ మళ్లీ కీలకమైన 23,100 మార్కును అధిగమించి స్థిరపడటంతో రానున్న వారం మార్కెట్లు మరింత బలంగా ఉండే అవకాశం ఉందని ట్రేడింగ్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ఆంధ్ర మెడికల్ కాలేజీ విద్యార్థిని ఆత్మహత్య

మొదటి పేజీ తరువాయి

పరిస్థితులపై ఆరా తీస్తున్నారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులను విచారిస్తున్నట్లు సమాచారం.

**చదువు ఒత్తిడే కారణమా?**

శైలజ చదువుకు సంబంధించిన ఒత్తిడి కారణంగానే ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు ప్రాథమికంగా సమాచారం వినిపిస్తోంది. అయితే ఆత్మహత్యకు అసలు కారణం ఏమిటన్నది పోలీసుల దర్యాప్తు పూర్తయిన తర్వాతే స్పష్టమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం దీనిపై అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. వైద్య విద్యార్థిని మృతితో కుటుంబ సభ్యులు, స్నేహితులు, తోటి విద్యార్థులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# ఇథనాల్‌తో రైతులకు అదనపు ఆదాయం: గడ్కరీ

మొదటి పేజీ తరువాయి

**ప్రజా రవాణా వ్యవస్థకు పెద్దపీట**




దేశంలో రవాణా రంగాన్ని హరిత ఇంధనాల వైపు మళ్లించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ప్రజారవాణా వ్యవస్థను మెరుగుపరచడం, ఎలక్ట్రిక్ మరియు ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలను ప్రోత్సహించడం ద్వారా కాలుష్యాన్ని అరికట్టవచ్చని తెలిపారు. పర్యావరణహిత ప్రయాణ విధానాలను అవలంబించాలని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# వరదల ఉధృతికి పాండ్రంగి బ్రిడ్జి పనులకు అపార నష్టం

**రూ.1.50 కోట్లకు పైగా నిర్మాణ సామగ్రి గల్లంతు.. గోస్తనీ ఉగ్రరూపంతో నిలిచిన పనులు**

**గడువులోగా పూర్తి చేయడం కష్టమే.. అదనపు సమయం ఇవ్వాలని ప్రభుత్వానికి కాంట్రాక్టు సంస్థ విజ్ఞప్తి...**







పద్మనాభం ఉషశ్రీ, సెప్టెంబర్ 25 :

పద్మనాభం మండలంలో గోస్తనీ నదిపై పాండ్రంగి వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులకు భారీ వర్షాలు తీవ్ర ఆటంకంగా మారాయి. గత కొద్ది రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాల కారణంగా గోస్తనీ నది ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తుండటంతో బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. నదిలో వరద ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో నిర్మాణానికి వినియోగించే విలువైన సామగ్రి నీట మునిగి, కొంతవరకు కొట్టుకుపోయింది. ఈ వరదల కారణంగా సుమారు రూ.1.50 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు నిర్మాణ సంస్థ ప్రతినిధి రవిచంద్ర వెల్లడించారు.ఎన్నో దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న పాండ్రంగి బ్రిడ్జి నిర్మాణ పనులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేగం పుంజుకున్నాయి. ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేసే దిశగా పనులు శరవేగంగా సాగుతూ, నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునే దశకు చేరుకున్న తరుణంలో ప్రకృతి వైపరీత్యం రూపంలో వరదలు తీవ్ర విఘాతం కలిగించాయి. దీంతో బ్రిడ్జి నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందోనన్న ఆందోళన స్థానిక ప్రజల్లో నెలకొంది.

దశాబ్దాల కల.. నెరవేరుతున్న వేళ వరదల రూపంలో విఘాతం

పద్మనాభం మండలంలోని పాండ్రంగి వద్ద గోస్తనీ నదిపై బ్రిడ్జి నిర్మాణం ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష. ఏళ్ల తరబడి ఈ బ్రిడ్జి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు పనులు ప్రారంభమై వేగంగా ముందుకు సాగుతుండటంతో కొత్త ఆశలు చిగురించాయి. ఈ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే పాండ్రంగి పరిసర ప్రాంతాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

పట్టణ ప్రాంతాలకు వెళ్లేందుకు, నిత్యావసర పనులు, విద్య, వైద్యం, వ్యాపార అవసరాల కోసం ప్రయాణించే ప్రజలకు ఈ బ్రిడ్జి ఎంతో కీలకమైన అనుసంధాన మార్గంగా ఉపయోగపడనుంది. సుమారు 30కి పైగా గ్రామాల ప్రజలకు ప్రయోజనం చేకూర్చే ఈ నిర్మాణం పూర్తయితే రవాణా ఇబ్బందులు గణనీయంగా తగ్గుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో నిర్మాణ పనులు గత ఎనిమిది నెలలుగా వేగంగా కొనసాగుతున్నాయి. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో నిర్మాణ సంస్థ సిబ్బంది, కార్మికులు పనిచేస్తున్న సమయంలో భారీ వర్షాలు కురవడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది.

గోస్తనీ ఉగ్రరూపం.. కొట్టుకుపోయిన నిర్మాణ సామగ్రి

గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గోస్తనీ నదిలో వరద ప్రవాహం విపరీతంగా పెరిగింది. నది ఉధృతంగా ప్రవహించడంతో బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన సామగ్రి నీటిలో మునిగిపోవడంతో పాటు కొంత సామగ్రి ప్రవాహానికి కొట్టుకుపోయింది.బ్రిడ్జి నిర్మాణంలో వినియోగించే టీఎంటీ ఇనుప బార్లు, షట్టర్ ప్లేట్లు, చానల్స్, గడ్డర్లు, క్రిబ్స్‌తో పాటు నది మధ్యలో నిర్మాణ పనులు చేపట్టేందుకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అప్రోచ్ నిర్మాణానికి వినియోగించిన గ్రావెల్, ఇతర నిర్మాణ సామగ్రి వరదల్లో నష్టపోయినట్లు నిర్మాణ సంస్థ ప్రతినిధి తెలిపారు. ఈ సామగ్రి విలువ సుమారు రూ.కోటి 50 లక్షలకు పైగా ఉంటుందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. ఒక్కసారిగా వరద ప్రవాహం పెరగడంతో నిర్మాణ సంస్థకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని, పనులు కొనసాగించేందుకు అవసరమైన సామగ్రి కొరత ఏర్పడిందని వివరించారు.నది ప్రవాహం ఇంకా తగ్గకపోవడంతో ప్రస్తుతం నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించే పరిస్థితి లేదని తెలిపారు.

గడువులోగా పూర్తి చేయడం కష్టమే.. అదనపు సమయం ఇవ్వాలని విజ్ఞప్తి

బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్న ఎస్‌వీఎస్ మూకాంబిక కన్స్ట్రక్షన్ సంస్థ ప్రతినిధి రవిచంద్ర మాట్లాడుతూ, గత ఎనిమిది నెలలుగా పనులను ఎంతో వేగంగా కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోనే బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలనే సంకల్పంతో పనిచేస్తున్నామని చెప్పారు.అయితే అనూహ్యంగా గోస్తనీ నదిలో వరద ఉధృతి పెరగడంతో నిర్మాణ పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. నదిలో ప్రవాహం తగ్గకపోవడం, నిర్మాణ సామగ్రి కొట్టుకుపోవడం వల్ల పనులు నిలిచిపోయాయని వివరించారు.ప్రస్తుతం నది ఉధృతి ఎప్పుడు తగ్గుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొందని, వరదలు తగ్గిన వెంటనే నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నదిలో సురక్షిత పరిస్థితులు ఏర్పడిన తర్వాతే పనులు కొనసాగించే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.వరదల కారణంగా జరిగిన భారీ నష్టం, పనులు నిలిచిపోవడం వల్ల ప్రభుత్వం తమకు నిర్దేశించిన గడువులోగా బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయడం కష్టసాధ్యంగా మారిందని రవిచంద్ర పేర్కొన్నారు. ఈ పరిస్థితులను ప్రభుత్వం, సంబంధిత అధికారులు పరిగణనలోకి తీసుకొని బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు అదనపు సమయం కేటాయించాలని పత్రికా ముఖంగా విజ్ఞప్తి చేశారు.

30కి పైగా గ్రామాలకు ప్రయోజనం.. ప్రజల్లో ఆందోళన

పాండ్రంగి బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే పరిసర ప్రాంతాల్లోని సుమారు 30కి పైగా గ్రామాల ప్రజలకు పట్టణ ప్రాంతాలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో గోస్తనీ నది ప్రవాహం పెరిగినప్పుడు ఎదురయ్యే రవాణా ఇబ్బందులు తగ్గుతాయని స్థానికులు ఆశిస్తున్నారు.ఏళ్ల తరబడి తమ ప్రాంతానికి బ్రిడ్జి నిర్మాణం కావాలని కోరుకుంటున్న ప్రజలకు పనులు వేగంగా జరుగుతుండటంతో తమ కల నెరవేరుతుందనే నమ్మకం కలిగింది. అయితే ఇప్పుడు వరదల కారణంగా పనులు నిలిచిపోవడం, కోట్లాది రూపాయల విలువైన సామగ్రి నష్టపోవడం వారిని తీవ్ర నిరాశకు గురిచేస్తోంది."మా ఎన్నో ఏళ్ల కల సాకారం అవుతున్న తరుణంలో వరదలు బ్రిడ్జి పనులకు ఆటంకంగా మారడం బాధాకరంగా ఉంది. ఈ బ్రిడ్జి పూర్తయితే మా ప్రాంతంలోని 30కి పైగా గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు వెంటనే స్పందించి నిర్మాణ పనులు తిరిగి ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలి" అని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అధికారులు స్పందించి పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలి

వరదల కారణంగా నిలిచిపోయిన పాండ్రంగి బ్రిడ్జి నిర్మాణ పనులపై సంబంధిత ప్రభుత్వ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. నిర్మాణ సంస్థకు ఎదురైన నష్టాలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏర్పడిన పరిస్థితులను పరిశీలించి, పనులు తిరిగి ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.నది ప్రవాహం తగ్గిన వెంటనే నిర్మాణ పనులను పునఃప్రారంభిస్తామని ఎస్‌వీఎస్ మూకాంబిక కన్స్ట్రక్షన్ సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. అయితే అదనపు సమయం కేటాయించడంతో పాటు నిర్మాణ పనులు నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని ప్రజలు ఆశిస్తున్నారు.దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పాండ్రంగి బ్రిడ్జి నిర్మాణం ఎలాంటి మరిన్ని ఆటంకాలు లేకుండా త్వరితగతిన పూర్తయి,తమ రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించాలని ఈ ప్రాంత గ్రామాల ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# ప్రజల భద్రతే లక్ష్యంగా.. మద్ది పంచాయతీ వీఆర్వో సుమిత్ర సేవలు అమోఘం!

**తునిపాలెం వద్ద ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వాగు.. ప్రజలు ఆ మార్గంలో వెళ్లకుండా స్వయంగా రంగంలోకి దిగిన వీఆర్వో**

పద్మనాభం ఉషశ్రీ, సెప్టెంబర్ 25 :

తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పద్మనాభం మండలం తహసిల్దార్ డి.శైలజ ఆదేశాలను అనుసరించి ప్రజల ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా మద్ది పంచాయతీ వీఆర్వో సుమిత్ర చేపట్టిన ముందస్తు జాగ్రత్త చర్యలు అభినందనీయంగా నిలిచాయి.విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఆమె చూపిన చొరవ స్థానికుల ప్రశంసలు అందుకుంటోంది.

పద్మనాభం మండలం మద్ది పంచాయతీ తునిపాలెం ప్రాంతంలో తుఫాన్ ప్రభావంతో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది.వర్షాల కారణంగా వాగులో నీటిమట్టం పెరిగి, ప్రవాహం ప్రమాదకరంగా మారడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. ముఖ్యంగా వాగు ఉధృతిని అంచనా వేయకుండా ప్రయాణించే వారు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉండటంతో అప్రమత్తమైన వీఆర్వో సుమిత్ర ప్రజల రక్షణ కోసం తక్షణ చర్యలకు ఉపక్రమించారు.



ప్రజలు అటువైపు వెళ్లకుండా స్వయంగా రంగంలోకి దిగిన ఆమె, తాటిచెట్టు కొమ్మలను స్వయంగా నరికి రోడ్డుకు

వాగు ప్రవాహం ప్రమాదకరంగా ఉన్న నేపథ్యంలో అడ్డంగా వేసి రాకపోకలను నిలిపివేశారు. అంతేకాకుండా,ఈ మార్గం ప్రమాదకరమని, ఎవరూ ఈ దారి గుండా వెళ్లరాదని ప్రజలకు తెలియజేస్తూ ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు.ఎలాంటి ప్రమాదం జరగకుండా ప్రజలను అప్రమత్తం చేయడంలో ఆమె చూపిన చొరవ ప్రత్యేకంగా నిలిచింది.ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ప్రమాదకర మార్గంలో రాకపోకలను అడ్డుకునేందుకు స్వయంగా కృషి చేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వ ఉద్యోగిగా తన బాధ్యతను గుర్తించి, ప్రజల భద్రత కోసం ముందుండి పనిచేసిన ఆమె సేవలను పలువురు అభినందిస్తున్నారు.తుఫాన్ సమయంలో ప్రజలు అధికారులు ఇచ్చే హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని, వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నప్పుడు వాటిని దాటేందుకు ప్రయత్నించకూడదని సూచిస్తున్నారు.అత్యవసర పరిస్థితులు మినహా ప్రమాదకర మార్గాల్లో ప్రయాణాలు చేయకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని కోరుతున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడటమే ప్రధాన ధ్యేయంగా, ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి బాధ్యతాయుతంగా వ్యవహరించిన మద్ది పంచాయతీ వీఆర్వో సుమిత్ర సేవలు నిజంగా అభినందనీయం. ప్రభుత్వ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఇలాంటి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టడం విపత్తుల సమయంలో ఎంతో కీలకమని ఈ ఘటన స్పష్టం చేస్తోంది.

# జడ్పీ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ డి.కె. బాలాజీ బాధ్యతల స్వీకరణ

మచిలీపట్నం ఉషశ్రీ, సెప్టెంబర్ 25 :

కృష్ణా జిల్లాకృష్ణా జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ బాధ్యతలు స్వీకరించారు. మచిలీపట్నంలోని జడ్పీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టిన అనంతరం జిల్లా ప్రగతిపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా సర్వతోముఖాభివృద్ధిలో ప్రజా పరిషత్ పాత్ర అత్యంత కీలకమైనదని స్పష్టం చేశారు.ప్రజా పరిషత్ అనేది కేవలం ఒక విభాగం మాత్రమే కాదని, అది ఒక బలమైన రాజ్యాంగబద్ధమైన వ్యవస్థ అని కలెక్టర్ గుర్తు చేశారు.

ప్రజల ప్రయోజనాలే పరమావధిగా, పూర్తి చిత్తశుద్ధితో తాము ఈ నూతన బాధ్యతలను నిర్వర్తిస్తామని ఆయన హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి జడ్పీ వ్యవస్థ ద్వారా మరింత ఊతం ఇస్తామని పేర్కొన్నారు.జిల్లాలోని క్షేత్రస్థాయి పరిస్థితులు, స్థానిక సమస్యలపై త్వరలోనే పూర్తి అవగాహన పెంచుకుంటామని కలెక్టర్ తెలిపారు. అనంతరం సమస్యల పరిష్కారానికి, జిల్లా పురోగతికి అవసరమైన ఒక ప్రత్యేక కార్యాచరణను (యాక్షన్ ప్లాన్) రూపొందిస్తామని వెల్లడించారు. జడ్పీ ద్వారా చేపట్టాల్సిన నిధుల కేటాయింపులు, అత్యవసర పనులు మరియు సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేసి కృష్ణా జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని డి.కె. బాలాజీ స్పష్టం చేశారు.

## అనాథ, విడిచిపెట్టబడిన పిల్లల సంరక్షణపై
# అవగాహన కల్పించాలి

విశాఖపట్నం, (ఉషశ్రీ )సెప్టెంబర్ 25 :

అనాథ, విడిచిపెట్టబడిన, వదిలివేసిన పిల్లల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారిణి సీహెచ్. సంతోషి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ప్రజలకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనాథ, తల్లిదండ్రులు విడిచిపెట్టిన లేదా వివిధ కారణాల వల్ల వదిలివేయబడిన పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్లు, డ్రైన్లు, నిర్మానుష్య ప్రాంతాలు లేదా పబ్లిక్ ప్రదేశాల్లో పడవేయకుండా చూడాలని సూచించారు. పిల్లలకు రక్షణ కల్పించేందుకు జిల్లాలో మధురవాడలోని 'శిశుగృహ'లో క్రెడిల్ బేబీ సెంటర్ (జతీఖఎశ్రీవ దీఖఎఎ జవత్తీవ) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు లేదా సంరక్షకులు పిల్లలను పెంచలేని పరిస్థితుల్లో, వారి ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేకుండా క్రెడిల్‌లో సురక్షితంగా ఉంచవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న లేదా అనాథగా కనిపించిన పిల్లల సమాచారం అందించేందుకు కింది నంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు:

చైల్డ్ హెల్ప్‌లైన్: 1098
ప్రాజెక్ట్ డైరెక్టర్, డబ్ల్యూడీసీడబ్ల్యూ శాఖ: 9440814575
జిల్లా బాలల సంరక్షణ అధికారి: 9949136649
శిశుగృహ మేనేజర్, మధురవాడ: 8919154458
చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్: 7658942792
బాలల సంక్షేమ కమిటీ: 9866084124

పిల్లలను అక్రమంగా విక్రయించడం, విక్రయించడం లేదా రోడ్లపై వదిలేయడం చట్టరీత్యా నేరమని అధికారులు తెలిపారు. సమాజంలో అలాంటి పిల్లలు కనిపించినప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి, వారిని సురక్షితంగా శిశుగృహానికి చేర్చేందుకు సహకరించాలని సీహెచ్. సంతోషి కోరారు.

## రైతు బజార్ల పార్కింగ్ స్థలాల నిర్వహణకు
# టెండర్ల ఆహ్వానం

విశాఖపట్నం,(ఉషశ్రీ )సెప్టెంబర్ 25: నగరంలోని యం.వి.ఏ. కాలనీ, గోపాలపట్నం, ముదపాక, కందరపాలెం రైతు బజార్లలో పార్కింగ్ స్థలాల నిర్వహణకు అధికారులు టెండర్లను ఆహ్వానించారు. ఒక సంవత్సరం కాలానికి పార్కింగ్ స్థలాలను నిర్వహించేందుకు నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

నెలవారీ కనీస టెండర్ మొత్తాలను ఈ విధంగా నిర్ణయించారు:

యం.వి.ఏ. కాలనీ రైతు బజార్: రూ.2,11,050
గోపాలపట్నం రైతు బజార్: రూ.55,755
ముదపాక రైతు బజార్: రూ.31,500
కందరపాలెం రైతు బజార్: రూ.36,750

పార్కింగ్ చేసే వాహనాలకు రుసుములను కూడా నిర్ణయించారు. సైకిల్‌కు రూ.2, ద్విచక్ర వాహనాలకు రూ.5, ఆటోకు రూ.10, కారుకు రూ.20 చొప్పున వసూలు చేయాల్సి ఉంటుంది. పార్కింగ్ నిర్వహణకు ఎంపికైన కాంట్రాక్టర్ నిర్ణయించిన నిబంధనల ప్రకారం పార్కింగ్ ఫీజులు వసూలు చేయాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. నగర పాలక సంస్థ అధికారిక కార్డు కలిగిన వారికి రైతు బజార్లలో పార్కింగ్ ఫీజు వసూలు చేయరాదని సూచించారు. ఆసక్తి ఉన్న కాంట్రాక్టర్లు సెప్టెంబర్ 29, 2026 సాయంత్రం 4 గంటలలోపు సంబంధిత కార్యాలయంలో డీడీ సమర్పించి టెండర్ ప్రక్రియలో పాల్గొనాలని అధికారులు తెలిపారు. టెండర్ ప్రక్రియ అనంతరం ఎంపికైన వారికి సంబంధిత నిబంధనల ప్రకారం పార్కింగ్ స్థలాల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు.

## అక్టోబర్ 6న జిల్లాస్థాయి యువజన ఉత్సవాలు

**యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి: సీఈవో రమ్య**

విశాఖపట్నం (ఉషశ్రీ) సెప్టెంబర్ 25: జిల్లాస్థాయి యువజన ఉత్సవాలను అక్టోబర్ 6న నిర్వహించనున్నట్లు యువజన సర్వీసుల శాఖ, సెట్విస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రమ్య తెలిపారు. జిల్లాలోని యువతీ యువకులు ఈ ఉత్సవాల్లో పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. గాయత్రి విద్యా పరిషత్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ అండ్ రీసెర్చ్ కళాశాల, సౌత్ ఈస్ట్ క్యాంపస్, రుషికొండలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు కలిగిన యువతీ యువకులు ఇందులో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. యువజన ఉత్సవాల్లో జానపద గేయాలు, జానపద నృత్యాలు, కవిత్వం, పెయింటింగ్, నుక్కడ్ నాటక్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు క్యూఆర్ కోడ్ లేదా సంబంధిత లింక్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాస్థాయి పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని రమ్య తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన యువతీ యువకులను 2027 జనవరి 12న ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు తీసుకువెళ్తామని వెల్లడించారు. కావున ఆసక్తి ఉన్న యువతీ యువకులు వెంటనే తమ పేర్లను నమోదు చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సెట్విస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రమ్య కోరారు.

## బలహీన పడిన తీవ్ర వాయుగుండం

**మరో 12 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం**

విశాఖపట్నం, ఉషశ్రీ, సెప్టెంబర్ 25:

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం క్రమంగా బలహీనపడింది. ప్రస్తుతం ఇది దక్షిణ ఒడిశా మరియు ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాలపై కేంద్రీకృతమై ఉత్తర-వాయువ్య దిశగా కదులుతున్నట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, ఈ వాయుగుండం రాబోయే 12 గంటల్లో మరింత బలహీనపడి అల్పపీడనంగా మారే అవకాశం ఉంది. వాయుగుండం ప్రభావంతో రాగల రెండు రోజుల పాటు కోస్తాంధ్ర వ్యాప్తంగా మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది. తీర ప్రాంతాల్లో మరియు పలు జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఉత్తర కోస్తా పరిసర ప్రాంతాల లోతట్టు ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

## ధరల మంటలో సామాన్యుడి బతుకు....

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలి...**
**మూలిగే నక్కపై తాటి కాయ పడినట్లు మూడు రోజులు ఆర్నాబ్ తుఫాన్ సామాన్యుల జీవన స్థితి గతులు ఆతలాకుతలం....**
**ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిపిఐ డిమాండ్.**

విశాఖ (ఉషశ్రీ) సెప్టెంబర్ 25: శుక్రవారం జీవీఎంసీ మధురవాడ నగరంపాలెంలో ఇంటి ఇంటికి కరపత్రాలు పంపిణి .ఈ సందర్భంగా సిపిఐ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ కేంద్రంలో ఎన్ డి ఎ, రాష్టంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తే ఆరు నెలలలో ధరలు అదుపులోకి తెస్తామని హామీలు గుప్పించారని, దేశంలో పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజల బతుకు రోజురోజుకూ భారమవుతోందన్నారు. కూరగాయలు కొనాలన్నా, నెలవారీ సరుకులు తెచ్చుకోవాలన్నా డబ్బులు సరిపోవడం లేదని చాలి చాలని ఆదాయంతో అప్పుల పాలవుతున్నారన్నారు. ఆరు నెలల కిందట రూ.40గా ఉన్న చక్కెర ఇప్పుడు ఏకంగా రూ.100 కి పెరిగిందని, 1300 వందలు ఉన్న 26 కిలోల బియ్యం బస్తా ధర ఏకంగా రూ.2000 అయ్యిందని, ఉల్లి కిలో రూ.100, అన్ని రకాల కూరగాయల ధరలు రెట్టింపు అయ్యాయని ధరలు అదుపులోకి తేవలసిన పాలకులు చర్యలు విఫలం చెందారని విమర్శించారు. గడిచిన మూడు రోజులుగా అర్నాబ్ తుఫాన్ వలన సర్వం కోల్పోయిన ప్రజలను ప్రభుత్వం తక్షణ సాయం అధించి ఆదుకోవాలని పైడిరాజు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా పార్టీ కార్యదర్శి వి సత్యనారాయణ, కుమారి, గురుమూర్తి, రమ, మంగ, సూర్యం, శంకరమ్మ, రమణ, భారతమ్మ తదితరులతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పరిశ్రమల అనుమతుల్లో జాప్యానికి తావులేదు

**కలెక్టర్ అభిషిక్త్ కిశోర్**





విశాఖపట్నం, ఉషశ్రీ, సెప్టెంబర్ 25 :

పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించిన వివిధ అనుమతుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఏ దశలోనూ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత సమయంలో అనుమతులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశంలో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని, ప్రభుత్వ ప్రాధాన్యత కలిగిన కంపెనీలు, ప్రాజెక్టుల అనుమతుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఏపీఐఐసీ ద్వారా ఏర్పాటు చేయనున్న కంపెనీలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, సేల్ డీడ్ ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు.

తుంగ్లాం వద్ద రైల్వే లైన్ల మధ్య ఉన్న సుమారు 12 ఎకరాల ఏపీఐఐసీ భూమిని వీలైనంత త్వరగా పారిశ్రామిక అవసరాలకు వినియోగంలోకి తీసుకురావాలని చెప్పారు. ఇందుకు రైల్వే అధికారులు కూడా త్వరితగతిన స్పందించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలన్నారు. నానో పార్కులు, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటును మరింత వేగవంతం చేయాలని, ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కుల విషయంలో స్పష్టమైన పురోగతి సాధించాలని ఆదేశించారు. పరిశ్రమలకు అందాల్సిన ఇన్సెంటివ్స్‌ను త్వరితగతిన శాంక్షన్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

పీఎంఈజీపీ ద్వారా వీలైనంత ఎక్కువ మందికి ఉపాధి లభించేలా చర్యలు చేపట్టాలని, ఎస్ఐపీబీలో ఆమోదం పొందిన, ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీల ఏర్పాటు పురోగతిని సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశానికి ముందు పలువురు కంపెనీల ప్రతినిధులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను సావధానంగా విన్న కలెక్టర్, తగిన చర్యలు తీసుకోవాలని డీఐసీ, ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ ద్వారా అందిన వినతులను కూడా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

సమావేశంలో డీఐసీ జనరల్ మేనేజర్ వి. ఆదిశేషు, ఏపీఐఐసీ జోనల్ కమిషనర్ సింహాచలం, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, రైల్వే తదితర శాఖల అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 110వ జయంతి వేడుకలు

**పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ**



విజయవాడ, సెప్టెంబర్ 25 (ఉషశ్రీ): పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ 110వ జయంతి వేడుకలను పురస్కరించుకుని విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని చిట్టినగర్ మండలం 47వ డివిజన్ దీన్‌దయాళ్ నగర్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.

కలరా ఆసుపత్రి ఎదురుగా ఉన్న పండిట్ దీన్‌దయాళ్ విగ్రహానికి బీజేపీ చిట్టినగర్ 46, 47, 48 మండలాల అధ్యక్షుడు దేవిన హరిప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బలివాడ శివకుమార్ పట్నాయక్, బీజేపీ సీనియర్ నాయకుడు పోతిన బేసుకుంటేశ్వరుడు మాట్లాడుతూ పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన విద్యావేత్తగా, రచయితగా, సంఘ ప్రచారకుడిగా సేవలందించారని పేర్కొన్నారు. ఆయన సిద్ధాంతాలను, ఆలోచనలను ప్రతి కార్యకర్త ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నెలరోజుల పాటు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా పండిట్ దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దుర్గగుడి పాలక మండలి సభ్యుడు అవ్వారు బుల్లబ్బాయి, శివాలయం ట్రస్ట్ బోర్డు సభ్యులు పత్తి శివరామకృష్ణ, పేరం బాల సత్యనారాయణ, చిట్టినగర్ మండల ప్రధాన కార్యదర్శి మారడాన జేజూబాబు, వేరుకొండ ఉమాకాంత్, కే. మాధవ్, బి. శంకర్, బెవర మురళీకృష్ణ, బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ రాయన ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పేద విద్యార్థినీ విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు.

# వర్షాలపై అప్రమత్తంగా యంత్రాంగం

**ప్రమాద ప్రాంతాల నుంచి 97 కుటుంబాలు, 257 మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు**



విశాఖపట్నం, సెప్టెంబర్ 25 (ఉషశ్రీ): విశాఖపట్నం జిల్లాలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, తీవ్ర వాయుగుండం ప్రభావం నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్, జీవీఎంసీ సిటీ ఆపరేషన్స్ సెంటర్ ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట్ల తక్షణ చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ముంపు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా 97 కుటుంబాలకు చెందిన 257 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. జీవీఎంసీ పరిధిలో 56 పునరావాస కేంద్రాలను అందుబాటులో ఉంచి, అక్కడ ఆశ్రయం పొందిన వారికి ఆహారం, ఇతర అవసరమైన సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు.

**జిల్లాలో 332.7 మి.మీ. సగటు వర్షపాతం**

సెప్టెంబర్ 21 నుంచి 25వ తేదీ ఉదయం 10 గంటల వరకు జిల్లాలో సగటున 332.7 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు కలెక్టర్ తెలిపారు. విశాఖపట్నం రూరల్‌లో 426.6 మి.మీ., సీతమ్మధారలో 398.6 మి.మీ., గోపాలపట్నంలో 375.2 మి.మీ., మహారాణిపేటలో 367.4 మి.మీ., ములగాడలో 364.2 మి.మీ., పెదగంట్యాడలో 360.8 మి.మీ., పెందుర్తిలో 348 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు వివరించారు. గంభీరంగెడ్డ రిజర్వాయర్ పూర్తి నీటిమట్టం 126 అడుగులకు చేరిందని, ప్రస్తుతం సుమారు 100 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తుండగా అదే స్థాయిలో మిగులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మేఘాద్రిగెడ్డ, రాయవాడ, తాటిపూడి రిజర్వాయర్లలో నీటిమట్టాలు సురక్షిత స్థాయిలో ఉన్నాయని చెప్పారు.

**12 ఇళ్లు దెబ్బతినగా.. 122 చెట్లు నేలకొరిగాయి**

భారీ వర్షాల కారణంగా జిల్లాలో 12 ఇళ్లు దెబ్బతిన్నాయని, వీటిలో 7 ఇళ్లు పూర్తిగా లేదా తీవ్రంగా, 5 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యుత్ శాఖకు చెందిన ఒక సబ్‌స్టేషన్, 36 ఫీడర్లు, 181 విద్యుత్ స్తంభాలు దెబ్బతినగా, 28,934 విద్యుత్ కనెక్షన్లపై ప్రభావం పడిందని చెప్పారు. ఆర్అండ్‌బీ పరిధిలో 11.5 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నట్లు తెలిపారు. 122 చెట్లు కూలిపోగా, 116 చెట్లను తొలగించి రాకపోకలను పునరుద్ధరించినట్లు చెప్పారు. ఉద్యాన పంటల్లో భాగంగా ఆనందపురం, భీమునిపట్నం మండలాల్లోని నాలుగు గ్రామాల్లో 34 మంది రైతులకు చెందిన 6.48 హెక్టార్ల అరటి పంట దెబ్బతిన్నట్లు వివరించారు. జిల్లాలో 13 పాఠశాలల భవనాలు లేదా ప్రహరీ గోడలు కూడా పాక్షికంగా దెబ్బతిన్నాయని తెలిపారు.

**కంట్రోల్ రూమ్‌లకు 234 ఫిర్యాదులు**

వర్షాల పరిస్థితిపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై కంట్రోల్ రూమ్‌లు తక్షణమే స్పందించాయని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు వచ్చిన 55 ఫిర్యాదులను పరిష్కరించినట్లు చెప్పారు. జీవీఎంసీ సిటీ ఆపరేషన్స్ సెంటర్‌కు వచ్చిన 179 ఫిర్యాదుల్లో 163 పరిష్కరించగా, మరో 16 ఫిర్యాదులపై చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపారు. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ముందస్తు చర్యలు చేపట్టామని, మౌలిక వసతుల పునరుద్ధరణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటి వరకు జిల్లాలో ఎలాంటి మానవ ప్రాణనష్టం నమోదు కాలేదని స్పష్టం చేశారు.

# పరిశ్రమల అనుమతుల్లో జాప్యానికి తావులేదు

## ఈజ్ ఆఫ్ డూయింగ్‌తో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌పై దృష్టి

విశాఖపట్నం, సెప్టెంబర్ 25 (ఉషశ్రీ): పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి వివిధ అనుమతుల జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఏ దశలోనూ దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత సమయంలో అనుమతులు మంజూరు చేయాలని సూచించారు.

శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా పరిశ్రమల ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశంలో పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల ప్రోత్సాహం, పారిశ్రామికవేత్తల సమస్యలు, పెండింగ్ అనుమతులపై కలెక్టర్ సమీక్షించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని, ప్రభుత్వ ప్రాధాన్యత కలిగిన కంపెనీలు, ప్రాజెక్టుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఏపీఐఐసీ ద్వారా ఏర్పాటు చేయనున్న కంపెనీలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, సేల్ డీడ్ ప్రక్రియలను వేగవంతం చేయాలని అన్నారు.

తుంగ్లాం వద్ద రైల్వే లైన్ల మధ్య ఉన్న సుమారు 12 ఎకరాల ఏపీఐఐసీ భూమిని వీలైనంత త్వరగా పారిశ్రామిక అవసరాలకు వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఇందుకు రైల్వే అధికారులు కూడా త్వరితగతిన స్పందించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

నానో పార్కులు, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటును వేగవంతం చేయాలని, ఉత్తర, దక్షిణ నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కుల విషయంలో స్పష్టమైన పురోగతి సాధించాలని అధికారులను ఆదేశించారు.

పరిశ్రమలకు అందాల్సిన ఇన్సెంటివ్స్‌ను త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పీఎంఈజీపీ ద్వారా వీలైనంత ఎక్కువ మందికి ఉపాధి లభించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్ఐపీబీలో ఆమోదం పొందిన, ఎంవోయూలు కుదుర్చుకున్న కంపెనీల ఏర్పాటు పురోగతిని సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

సమావేశానికి ముందు పలువురు కంపెనీల ప్రతినిధులు తమ పరిశ్రమలకు సంబంధించిన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను విన్న కలెక్టర్, సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పరిశ్రమల కేంద్రం, ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు.

పీజీఆర్ఎస్ ద్వారా అందిన పారిశ్రామికవేత్తల వినతులను కూడా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ వి. ఆదిశేషు, ఏపీఐఐసీ జోనల్ కమిషనర్ సింహాచలం, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, రైల్వే తదితర శాఖల అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

RNI NO: APTEL/25/A4894
ఉషశ్రీ USHASRI తెలుగు దినపత్రిక

# రైతు సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం

## సంపాదకీయం

### అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక్కసారిగా హీట్

అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ గురువారం అసాధారణ రీతిలో కళకళలాడిపోయింది. ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన రెండు దేశాల అధినేతలు ఒకే వేదికపైకి రావడంతో అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక్కసారిగా హీట్ పెరిగింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ రాకతో వాషింగ్టన్‌లోని అధికారిక నివాసం మేళ తాళాలతో దద్దరిల్లింది. పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జిన్‌పింగ్ అమెరికా గడ్డపై అడుగుపెట్టడంతో ఈ భేటీకి అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ట్రంప్ స్వయంగా రెడ్ కార్పెట్ స్వాగతం పలకడమే కాకుండా, మిలటరీ గౌరవ వందనం, హెలిప్యాడ్ చూపించడం వంటి ప్రత్యేక ఏర్పాట్లతో ఈ పర్యటనను ఒక చారిత్రక ఘట్టంగా మలిచారు. ఈ సమావేశంలో అందరి దృష్టిని విపరీతంగా ఆకర్షించిన ప్రధాన అంశం ట్రంప్ ఇచ్చిన ఖరీదైన బహుమతి. విందు సమయంలో ట్రంప్ దంపతులు స్వయంగా కలిసి రూపొందించిన సుమారు మూడు అడుగుల ఎత్తైన 'బాల్డ్ ఈగల్' (అమెరికా జాతీయ పక్షి అయిన గద్ద) శిల్పాన్ని జిన్‌పింగ్‌కు కానుకగా అందించారు. అమెరికా స్వేచ్ఛా స్ఫూర్తికి, ఎగసిపడే సాహసానికి ప్రతీకగా నిలిచే ఈ అందమైన శిల్పం బీజింగ్‌లో ప్రముఖ స్థానంలో కొలువుదీరాలని కోరుకుంటున్నట్లు ట్రంప్ మనసారా చెప్పారు. ఈ బహుమతి ఇరు దేశాల మధ్య ఉన్న వైరుధ్యాలను పక్కనపెట్టి, వ్యక్తిగత బంధాలను ఎంతగా బలపరుస్తోందో చెప్పడానికి నిదర్శనంగా నిలిచింది. బయటకు ఎంత ఘనంగా కనిపించినా, తెరవెనుక మాత్రం వాడివేడి చర్చలే నడిచాయి. వాణిజ్యం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, తైవాన్ భవితవ్యం వంటి సున్నితమైన అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా మంతనాలు జరిపారు. ప్రస్తుతానికి టారిఫ్ యుద్ధానికి సంబంధించి కుదుర్చుకున్న వాణిజ్య విరామాన్ని వచ్చే జనవరి 10 వరకు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. అయినప్పటికీ, అరుదైన ఖనిజాల సరఫరా, టెక్నాలజీ ఆంక్షలు మరియు చైనా వ్యవహార శైలిపై ఇప్పటికీ పెద్ద ఎత్తున భేదాభిప్రాయాలు అలాగే ఉన్నాయని దౌత్య వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

ఈ సమ్మిట్‌లో అత్యంత సున్నితమైన తైవాన్ అంశం మరోసారి ప్రధాన చర్చనీయాంశమైంది. స్వయంప్రతిపత్తి కలిగిన తైవాన్‌పై చైనా తన వాదనను గట్టిగా వినిపించింది. తైవాన్ స్వాతంత్ర్య వాదనను అమెరికా పూర్తిగా వ్యతిరేకించాలని, ఈ విషయంలో వాషింగ్టన్ చాలా అప్రమత్తంగా వ్యవహరించాలని జిన్‌పింగ్ కుండబద్దలు కొట్టినట్లు సమాచారం. అమెరికా మాత్రం తైవాన్‌కు సంబంధించిన సైనిక సహాయ ప్యాకేజీలను ఒక బలమైన బేరసారాల ఆయుధంగా వాడుకుంటూ ఉండటంతో, అమెరికన్ రాజకీయ వర్గాల్లో దీనిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఈ సమావేశంలో ట్రంప్, జిన్‌పింగ్ ఇద్దరి శైలి పూర్తిగా భిన్నంగా కనిపించింది. ట్రంప్ తనదైన శైలిలో వ్యక్తిగత స్నేహానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ.. "మన రెండు దేశాలు ఇంతవరకు ఇంత మంచి సఖ్యతతో ఎప్పుడూ లేవు" అంటూ ఆకాశానికి ఎత్తేశారు.

మరోవైపు జిన్‌పింగ్ మాత్రం చాలా పకడ్బందీగా వ్యవహరిస్తూ, వ్యక్తిగత సంబంధాల కంటే దేశ ప్రయోజనాలే ముఖ్యమని, పరస్పర గౌరవం ఉంటేనే దీర్ఘకాలిక ప్రయోజనాలు నెరవేరుతాయని తనదైన శైలిలో హితవు పలికారు.

అమెరికా, చైనాల మధ్య కొత్తగా మొదలైన టెక్ వార్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్ర పోషిస్తోంది. ఏఐ టెక్నాలజీని 'సూపర్ ఇంటెలిజెన్స్' అంటూ అభివర్ణించిన ట్రంప్, దానిపై ఎలాంటి కొత్త ఆంక్షలు లేదా నిబంధనలు పెట్టాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. అయితే చైనా అధినేత జిన్‌పింగ్ మాత్రం దీనికి పూర్తిగా భిన్నంగా స్పందించారు. ఏఐ అభివృద్ధి అనేది మానవాళి మనుగడకు మేలు చేసేలా ఉండాలని, అది ఎల్లప్పుడూ మానవ నియంత్రణలోనే ఉండేలా కఠినమైన నిఘా ఉండాలని డిమాండ్ చేశారు.

**ఖరీఫ్ ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు**
**నవంబర్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం సేకరణ**
**2,619 కొనుగోలు కేంద్రాలు.. 31 వేల జీపీఎస్ వాహనాలు**
**రైతుల ఖాతాల్లో 24 గంటల్లోనే సేకరణ సొమ్ము**





విజయవాడ (ఉషశ్రీ), సెప్టెంబర్ 25: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 2026-27 ఖరీఫ్ ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని, ధాన్యం సేకరణ ప్రక్రియలో వేగం, పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. విజయవాడ అంత్రాలక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన 2026-27 ఖరీఫ్ ధాన్యం సేకరణ రాష్ట్రస్థాయి సన్నద్ధత సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 1 నుంచి ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ సీజన్‌లో సుమారు 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

**2,619 కొనుగోలు కేంద్రాలు**

రైతులకు అందుబాటులో ఉండేలా రాష్ట్రవ్యాప్తంగా 2,619 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. వీటి నిర్వహణకు సుమారు 24 వేల మంది సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులను ముందుగానే సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ధాన్యం సేకరణ కోసం 6.10 కోట్ల గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచుతున్నట్లు మంత్రి తెలిపారు. ఎక్కడా గన్నీ బ్యాగుల కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని, అవసరమైతే ప్రత్యామ్నాయ బ్యాగులను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

**సొంత వాహనాలతో ధాన్యం తరలిస్తే రవాణా ఛార్జీలు**

రైతులు తమ సొంత వాహనాల్లో కల్లాల నుంచి రైస్ మిల్లులకు ధాన్యం తరలించినప్పుడు రవాణా ఛార్జీల చెల్లింపులో జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ ఖరీఫ్‌లో ధాన్యం రవాణా కోసం సుమారు 31 వేల జీపీఎస్ వాహనాలను వినియోగించనున్నట్లు చెప్పారు. సొంత వాహనాల్లో ధాన్యం తరలించే రైతులకు రవాణా ఛార్జీలను వీలైనంత త్వరగా నేరుగా వారి ఖాతాల్లో జమ చేసే విధానం అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. గత ఖరీఫ్‌లో సుమారు రూ.12 వేల కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించామని మంత్రి తెలిపారు. ఇందులో 92 శాతానికి పైగా మొత్తాన్ని 24 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. ఈసారి కూడా సేకరణ సొమ్మును ఎలాంటి జాప్యం లేకుండా రైతులకు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎల్-నినో ప్రభావం ఉంటుందని తొలుత అంచనా వేసిన నేపథ్యంలో ధాన్యం ఉత్పత్తి అంచనాలు 1.60 కోట్ల టన్నుల నుంచి సుమారు 1.10 కోట్ల టన్నులకు తగ్గినట్లు మంత్రి తెలిపారు. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, పంట పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఉత్పత్తి అంచనాలను మరోసారి సమీక్షించనున్నట్లు చెప్పారు. అవసరమైతే కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ధాన్యం సేకరణ లక్ష్యాలను సవరించనున్నట్లు వెల్లడించారు.

**రైతుల కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలు**

ధాన్యం సేకరణకు సంబంధించి రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లాల వారీగా జాయింట్ కలెక్టర్లు ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పౌరసరఫరాలు, వ్యవసాయ శాఖ అధికారులు, జాయింట్ కలెక్టర్లు, రైస్ మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. రైస్ మిల్లర్లు కూడా తమకు కేటాయించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ కె. కన్నబాబు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్, ఏపీఎస్‌సీఎస్‌సీఎల్ ఛైర్మన్ తోట మెహర్ సీతారామ సుధీర్, ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డా. పి.వి. సత్యనారాయణ, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ నుపూర్ అజయ్ కుమార్, రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. వెంకటేశ్వరరావు, జిల్లాల జాయింట్ కలెక్టర్లు, అధికారులు, రైతులు, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు ధర భరోసా.. వినియోగదారుడికి ధరల ఊరట

**రైతుబజార్లలో సన్నబియ్యం కిలో రూ.50.. ఉల్లిపాయలు రూ.35**
**8.81 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రణాళిక**
**కొనుగోలు కార్యక్రమాలకు రూ.2,216.48 కోట్ల ఆర్థిక మద్దతు**
**రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ చేపట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

అమరావతి (ఉషశ్రీ), సెప్టెంబర్ 25: రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు వినియోగదారులకు నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ చేపట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతుబజార్లు, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులను సరసమైన ధరలకు అందిస్తూ ధరల భారాన్ని తగ్గించే చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ధరల పర్యవేక్షణ, నిత్యావసరాల ధరల స్థిరీకరణ, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర, రబీ పంటల ప్రణాళికపై మంత్రుల బృందం గురువారం రాత్రి నిర్వహించిన వర్చువల్ సమావేశంలో పలు అంశాలపై చర్చించింది. సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు.

**రైతుబజార్లలో సరసమైన ధరలకు నిత్యావసరాలు**

రైతుబజార్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా కేఎన్‌ఎం, బీపీటీ వంటి సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ.50కు, ఉల్లిపాయలను కిలో రూ.35కు విక్రయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పామాయిల్, కందిపప్పును సబ్సిడీ ధరలకు అందిస్తున్నామని, చక్కీ గోధుమపిండిని కిలో రూ.27కు సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. పాలు, బియ్యం, చికెన్, వంటనూనెలు, కందిపప్పు, మినుములు, వేరుశనగ, ఉల్లిపాయలు, గుడ్లు, టమాటా, అరటి తదితర 14 ప్రధాన వస్తువుల ధరలను నిరంతరం పర్యవేక్షించాలని నిర్ణయించినట్లు చెప్పారు.



**8.81 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలు**

రాష్ట్ర అవసరాలు, పంటల ఉత్పత్తి, రైతులకు లభించే ధరలు, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని జిల్లాలవారీగా ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక రూపొందించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 8.81 లక్షల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఇందులో వరి సాగు నుంచి 3 లక్షల హెక్టార్లు, ఖరీఫ్‌లో సాగు కాని 4 లక్షల హెక్టార్లు, మిరప సాగు తగ్గిన 1.50 లక్షల హెక్టార్లను ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించనున్నట్లు వివరించారు. శనగలు 1.88 లక్షల హెక్టార్లు, మొక్కజొన్న 1.51 లక్షల హెక్టార్లు, మినుములు 1.27 లక్షల హెక్టార్లు, పొద్దుతిరుగుడు 72 వేల హెక్టార్లు, పెసలు 68 వేల హెక్టార్లు, వేరుశనగ 62 వేల హెక్టార్లు, రబీ జొన్న 60 వేల హెక్టార్లు, కంది 46 వేల హెక్టార్లలో సాగుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

**ముందస్తుగా నమోదు చేసుకున్న రైతుల నుంచి కొనుగోళ్లు**

ముఖ్యమంత్రి సూచనల మేరకు ముందస్తుగా నమోదు చేసుకున్న రైతుల నుంచి రాగులు, కందులు, మినుములను కనీస మద్దతు ధరకు 100 శాతం కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. పచ్చిరొట్ట పంటల విత్తనాలను కూడా పూర్తిస్థాయిలో తిరిగి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పెసలు, శనగలు, వేరుశనగ, పొద్దుతిరుగుడు ఉత్పత్తిలో 30 శాతం వరకు కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. మొక్కజొన్నకు అవసరమైన కొనుగోలు మద్దతు కల్పించనున్నట్లు వెల్లడించారు.

**ఉల్లిపాయల కొనుగోలుకు ధరల స్థిరీకరణ నిధి**

ఉల్లిపాయలకు కనీస మద్దతు ధర లేనందున రాష్ట్ర ధరల స్థిరీకరణ నిధి ద్వారా కొనుగోలు చేసి, అదే సమయంలో మార్కెట్‌లో విక్రయించే విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర వినియోగ అవసరాలకు సరిపడా ఉల్లిపాయల ఉత్పత్తిని పెంచి, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే సరఫరాపై ఆధారపడటాన్ని దశలవారీగా తగ్గించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వంటనూనెల ధరల నేపథ్యంలో పొద్దుతిరుగుడు, వేరుశనగ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. జొన్నలు, రాగులను ప్రజా పంపిణీ వ్యవస్థలో చేర్చి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసే అంశంపై కేంద్ర ప్రభుత్వ సహకారం కోరనున్నట్లు వెల్లడించారు.

**రూ.2,216.48 కోట్ల ఆర్థిక మద్దతు అవసరం**

రైతులకు ధరల మద్దతు కల్పించే కొనుగోలు కార్యక్రమాలకు రూ.2,216.48 కోట్ల ఆర్థిక మద్దతు అవసరమవుతుందని అంచనా వేసినట్లు అచ్చెన్నాయుడు తెలిపారు. ఇందులో వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు రూ.1,979 కోట్ల ప్రభుత్వ హామీ, కొనుగోలు కార్యకలాపాల నిర్వహణకు రూ.237.48 కోట్ల వ్యయం ఉన్నట్లు వివరించారు.

విత్తనాల సరఫరా కోసం ఆంధ్రప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థకు పెండింగ్‌లో ఉన్న రూ.184 కోట్లతో పాటు అదనంగా ఆమోదించిన రూ.94 కోట్లు కలిపి రూ.278 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. పంటలను కాపాడేందుకు అవసరమైన రక్షక తడుల కోసం రూ.190 కోట్ల బడ్జెట్ ప్రతిపాదించినట్లు వెల్లడించారు.

వ్యవసాయ, మార్కెటింగ్, పౌరసరఫరాలు, ఆర్థిక శాఖలు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు ధరల భరోసా, వినియోగదారులకు సరసమైన ధరలకు నిత్యావసర సరుకుల అందుబాటును నిర్ధారించాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

# ఆలోచనలకు రెక్కలు.. ప్రతిభకు అవకాశాలు




మంగళగిరి, సెప్టెంబర్ 25 (ఉషశ్రీ): సృజనాత్మకత, ప్రతిభ, సాంకేతికత కలయికతో యువతకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. సృజనాత్మక ఆర్థిక రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో కళలు, డిజైన్, చలనచిత్రం, సంగీతం, యానిమేషన్, గేమింగ్, డిజిటల్ కంటెంట్, ప్రకటనలు, ఫ్యాషన్ తదితర రంగాల్లో ప్రతిభావంతులకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మంగళగిరిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో ఏపీ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, జాడెక్స్ ఇన్నోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్, ఫిల్మ్ ఆర్క్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం 'అమరావతి క్రియేటివ్ ఎకానమీ'పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఏపీ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి వర్క్‌షాప్‌ను ప్రారంభించగా, సాయంత్రం జరిగిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి సుమారు 300 మంది యువతీయువకులు పాల్గొన్నారు. కథా రచన, దర్శకత్వం, నిర్మాణం, ఎడిటింగ్, దృశ్య వీఎఫ్‌ఎక్స్, యానిమేషన్ తదితర విభాగాలపై యువతకు అవగాహన కల్పించారు. స్థానికంగానే సృజనాత్మక రంగంలో అవకాశాలు అందిపుచ్చుకునేలా జాడెక్స్ ఇన్నోవిజన్, ఫిల్మ్ ఆర్క్ బృంద సభ్యులు శిక్షణ, మార్గదర్శకత్వం అందించారు. ఈ సందర్భంగా తేజస్వి పొడపాటి మాట్లాడుతూ సినీ దర్శకులు, కంటెంట్ సృష్టికర్తలు, యానిమేటర్లు, వీఎఫ్‌ఎక్స్ కళాకారులు, కథకులు, సృజనాత్మక ఆవిష్కర్తలను ఒకే వేదికపైకి తీసుకురావడం స్ఫూర్తిదాయకమన్నారు. అమరావతిలో సృజనాత్మకత, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ ప్రతిభావంతులకు కొత్త అవకాశాలు కల్పించే కార్యక్రమంలో భాగస్వామిగా ఉండటం ఆనందంగా ఉందన్నారు. కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ డిజిటల్ సాంకేతికతతో పాటు కృత్రిమ మేధస్సు అందుబాటులోకి రావడంతో సృజనాత్మక రంగంలో కొత్త మార్గాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. యువత తమ సృజనాత్మకతను సాంకేతిక నైపుణ్యాలతో అనుసంధానం చేసుకుని ప్రపంచస్థాయి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆలోచనలను ఉత్పత్తులు, సేవలు, వ్యాపార అవకాశాలుగా మలుచుకునేలా నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, మార్గదర్శకత్వం అందించాల్సిన అవసరం ఉందన్నారు. అమరావతి రాజధాని ప్రాంతం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో సృజనాత్మక పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఏర్పడుతోందని కలెక్టర్ పేర్కొన్నారు.

సాంకేతికత, మౌలిక వసతులు, యువ ప్రతిభ, పెట్టుబడులు ఒకే వేదికపైకి వస్తే క్రియేటివ్ ఇండస్ట్రీ మరింత వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. స్థానిక ప్రతిభకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుతో పాటు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను పెంచేందుకు సృజనాత్మక రంగం కీలకంగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జాడెక్స్ ఇన్నోవిజన్ బృంద సభ్యులు దివ్య కొనకళ్ల, రాఘవ చైతన్య, పి. శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల నియంత్రణకు సీ4 కేంద్రంలో

# తొలి 'సైట్రైన్' శిక్షణ పూర్తి



విజయవాడ (ఉషశ్రీ), సెప్టెంబర్ 25: సైబర్ నేరాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పోలీసు అధికారులు, సిబ్బందికి సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించే దిశగా ఎన్.టి.ఆర్. జిల్లా పోలీస్ కమిషనరేట్ పరిధిలోని "సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (సీ4)" లో తొలి 'సైట్రైన్' శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయింది. రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ఐపీఎస్ చేతుల మీదుగా ప్రారంభమైన సీ4 కేంద్రం ద్వారా పోలీసుల సాంకేతిక సామర్థ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 21 నుంచి 25 వరకు ఐదు రోజులపాటు పోలీసు అధికారులు, సిబ్బందికి 'సైట్రైన్' ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించారు.

**డిజిటల్ ఫోరెన్సిక్స్‌పై శిక్షణ**

సైబర్ క్రైమ్ డీసీపీ కె.కృష్ణ ప్రసన్న, ఐపీఎస్ పర్యవేక్షణలో సైబర్ క్రైమ్ ఎస్ఐ రామకృష్ణ, ఐటీ కోర్ ఇన్‌ఛార్జి ఆర్ఎస్ఐ పవన్ కిశోర్, సిబ్బంది శిక్షణ అందించారు. శిక్షణలో సైబర్ నేరాల స్వభావం, డిజిటల్ ఫోరెన్సిక్స్, సాంకేతిక విచారణలో అనుసరించాల్సిన వ్యూహాలు, ఆధునిక సాంకేతిక సాధనాల వినియోగంపై క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు. కేస్ స్టడీలతో పాటు తుది అంచనా పరీక్షను నిర్వహించారు.

**18 మంది పోలీసులకు అభినందనలు**

తొలి సైట్రైన్ ఆన్‌లైన్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన 18 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని సైబర్ క్రైమ్ డీసీపీ కె.కృష్ణ ప్రసన్న, ఐపీఎస్, సైబర్ క్రైమ్ ఏసీపీ భానుప్రకాష్ రెడ్డి అభినందించారు. ఈ శిక్షణ ద్వారా పోలీసు సిబ్బంది విధుల నిర్వహణలో సాంకేతిక నైపుణ్యాలు, పనితీరు మరింత మెరుగుపడతాయని అధికారులు తెలిపారు.

# పాతబొబ్బిలిలో ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బేబీనాయన







బొబ్బిలి (ఉషశ్రీ), సెప్టెంబర్ 25:

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పాతబొబ్బిలి నుంచి టీబీఆర్ థియేటర్ మార్గంలో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కె.కె. రంగారావు (బేబీనాయన) మున్సిపల్ కమిషనర్, ఇరిగేషన్ అధికారులతో కలిసి ముంపు ప్రాంతాన్ని పరిశీలించారు. నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న గట్లను తొలగించి నీరు సాఫీగా వెళ్లేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు.

# శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ




తిరుచానూరు (ఉషశ్రీ), సెప్టెంబర్ 25: తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో పవిత్ర సమర్పణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి పవిత్ర సమర్పణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.






# ఈసీ వెంటనే రాజీనామా చేయాలంటూ మైనంపల్లి ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం

హైదరాబాద్ (ఉషశ్రీ), సెప్టెంబర్ 25:

ఈసీ వెంటనే రాజీనామా చేయాలంటూ మల్కాజిగిరి చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఈసీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈసీ వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు.



# బాలాపూర్ గణేష్ పూజా వేడుకలు ప్రారంభం.. మండపం వద్ద భారీ బందోబస్తు

మహేశ్వరం (ఉషశ్రీ), సెప్టెంబర్ 25:

ప్రసిద్ధ బాలాపూర్ గణేష్ పూజా వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రుల అనంతరం చివరి పూజా కార్యక్రమాలతో గణేష్ మండపం వద్ద ఉత్సవాలు మొదలయ్యాయి. భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. గణేష్ మండపం పరిసరాల్లో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక నిఘా బృందాలతో పాటు సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక బృందాలను సైతం నియమించారు.



# ప్రకాశం బ్యారేజీకి పెరుగుతున్న వరద ప్రవాహం

విజయవాడ (ఉషశ్రీ), సెప్టెంబర్ 25: ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి వరద ప్రవాహం పెరుగుతోంది. ప్రస్తుతం 40,521 క్యూసెక్కుల వరద నీరు బ్యారేజీకి చేరుతోంది. అధికారులు బ్యారేజీ గేట్లు ఎత్తి 36,250 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కృష్ణా పశ్చిమ డెల్టాకు 4,012 క్యూసెక్కులు, గుంటూరు ఛానల్‌కు 239 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

# రాజమండ్రి విమానాశ్రయంలో విమాన రాకపోకలకు అంతరాయం

రాజమండ్రి (ఉషశ్రీ), సెప్టెంబర్ 25:

ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా రాజమండ్రి విమానాశ్రయంలో విమాన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముంబై, హైదరాబాద్ నుంచి రావాల్సిన రెండు విమానాలను వాతావరణం అనుకూలించకపోవడంతో దారి మళ్లించినట్లు సమాచారం.

# వైసీపీకి షాక్.. జనసేనలోకి కీలక నేతల చేరిక

అమరావతి (ఉషశ్రీ), సెప్టెంబర్ 25:

వైసీపీకి చెందిన పలువురు కీలక నాయకులు జనసేన పార్టీలో చేరారు. జనసేన అధ్యక్షుడు, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో శుక్రవారం పార్టీ కండువాలు కప్పుకుని జనసేనలో చేరారు.

తుని నియోజకవర్గ వైసీపీ నాయకుడు యనమల కృష్ణుడు, హిందూపురం సీనియర్ వైసీపీ నాయకుడు నవీన్ నిశ్చల్‌తో పాటు పలువురు నేతలు జనసేనలో చేరారు. పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ పాలనలో చూపుతున్న నిబద్ధత, సంస్కరణలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు.

కొత్తగా చేరిన నాయకులను పవన్ కళ్యాణ్ సాదరంగా ఆహ్వానించి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అందరినీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

# విద్యుదాఘాత మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే బేబీనాయన

తెర్లాం (ఉషశ్రీ), సెప్టెంబర్ 25:

తెర్లాం మండలంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఇద్దరి కుటుంబాలను బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కె.కె. రంగారావు (బేబీనాయన) పరామర్శించారు. గొలుగువలసలో విద్యుదాఘాతంతో మృతి చెందిన అప్పలంపేటకు చెందిన కాబోతుల పోలిరాజు కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆమిటి గ్రామంలో కరెంట్ స్థంభం మీదపడి మృతి చెందిన ములగపాక అచ్చయ్యమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. విద్యుత్ అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున వీలైనంత త్వరగా సహాయం అందించాలని సూచించారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.




# మహిళల భద్రతకే కూటమి ప్రభుత్వం తొలి ప్రాధాన్యత: హోంమంత్రి అనిత

నక్కపల్లి (ఉషశ్రీ), సెప్టెంబర్ 25:

మహిళలు నిర్భయంగా, ఆత్మగౌరవంతో జీవించేలా పూర్తి స్థాయి రక్షణ కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట, నక్కపల్లి ఆటో స్టాండ్లలో మహిళా భద్రత కోసం చేపట్టిన 'అభయ' కార్యక్రమంపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా హోంమంత్రి స్వయంగా ఆటోలు, ఆర్టీసీ బస్సులకు 'అభయ' భద్రతా స్టిక్కర్లను అంటించారు. అనంతరం నక్కపల్లి వద్ద ఆర్టీసీ బస్సును తనిఖీ చేసి, మహిళా ప్రయాణికులతో మాట్లాడి 'అభయ' రక్షణ వ్యవస్థ, ఆపత్కాలంలో పోలీసుల సహాయం పొందే విధానంపై అవగాహన కల్పించారు.

మహిళల రక్షణలో ఆటో డ్రైవర్లు, ప్రజారవాణా సిబ్బంది కీలక పాత్ర పోషించాలని అనిత సూచించారు. అనుమానాస్పద పరిస్థితులు, ఆపదలు ఎదురైనప్పుడు మహిళలకు అండగా నిలవాలని కోరారు. మహిళా భద్రత విషయంలో ప్రభుత్వం రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.






కార్యక్రమంలో నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పోతిరెడ్డి శ్రీనివాసరావు, నక్కపల్లి సీఐ మురళి, ఎస్సై సన్నీబాబు, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆటో డ్రైవర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఖైరతాబాద్ బడా గణేశుడి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సీపీ సజ్జనార్

హైదరాబాద్ (ఉషశ్రీ), సెప్టెంబర్ 25:

ఖైరతాబాద్ బడా గణేశుడి నిమజ్జన ఏర్పాట్లను నగర పోలీస్ కమిషనర్ సీవీ సజ్జనార్ ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంతకుముందు బడా గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాలాపూర్ నుంచి హుస్సేన్‌సాగర్ వరకు సాగే ప్రధాన శోభాయాత్ర, ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు సీపీ తెలిపారు. జీహెచ్ఎంసీ, విద్యుత్, జలమండలి తదితర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. బందోబస్తు కోసం సుమారు 20 వేల మంది పోలీస్ సిబ్బందిని విధుల్లోకి దించినట్లు తెలిపారు. శోభాయాత్ర మార్గాల్లోని సుమారు 10 వేల సీసీ కెమెరాలను టీజీఐసీసీసీ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించి నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు, యువతుల భద్రత కోసం 26 షీ-టీమ్స్ బృందాలు మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తాయని తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ విభాగం జారీ చేసే మార్గదర్శకాలను గమనించి, అందుకు అనుగుణంగా ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని సీపీ సజ్జనార్ సూచించారు. నిమజ్జన పర్వాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.






# జహీరాబాద్‌లో రూ.2.58 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం

**పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, మాజీ మంత్రి డా. ఏ. చంద్రశేఖర్**

కోహినూర్(ఉషశ్రీ), సెప్టెంబర్ 25:

జహీరాబాద్: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, జహీరాబాద్ పట్టణ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి డా. ఏ. చంద్రశేఖర్ అన్నారు. జహీరాబాద్ మున్సిపాలిటీ టౌన్ డెవలప్‌మెంట్ ఫండ్ ద్వారా పట్టణంలోని పలు వార్డుల్లో రూ.2.58 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు వారు శంకుస్థాపన చేశారు.

పట్టణంలోని 3, 6, 16, 17, 22, 33వ వార్డుల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. రహదారుల నిర్మాణంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు మెరుగైన సౌకర్యాలు కలగడంతో పాటు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడుతుందని నాయకులు తెలిపారు.



పట్టణంలో మౌలిక వసతులను మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

టౌన్ డెవలప్‌మెంట్ ఫండ్‌ను వినియోగించి చేపడుతున్న ఈ పనులు పూర్తయితే పలు వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం ఉందని తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ యూనుస్, వైస్ చైర్మన్ శిరీషారెడ్డి, సీడీసీ చైర్మన్ ముబీన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్షద్ అలీ, జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడు నరేష్‌గౌడ్, మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఉదయ్ శంకర్ పాటిల్, పవన్ రాథోడ్, కాంగ్రెస్ నాయకులు ఉజ్వల్‌రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింలు, మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాక్సూద్ అహ్మద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, కోహీర్ పట్టణ అధ్యక్షుడు ముజాఫర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, కౌన్సిలర్లు జానాభాయ్, శ్రీధర్‌రెడ్డి, జమీలోద్దీన్, జఫ్ఫార్, జహంగీర్, ఏఎంసీ డైరెక్టర్ శేఖర్, కాంగ్రెస్ నాయకులు నయీమ్, అరవింద్, గౌస్, నవీద్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# రష్యాపై వందల డ్రోన్లతో దాడి..

## చమురు రిఫైనరీని ధ్వంసం చేసిన ఉక్రెయిన్!



రాత్రి వేళ ఒక్కసారిగా రష్యా ఆకాశంలోకి వందలాది డ్రోన్లు దూసుకొచ్చాయి. రష్యాలోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని భారీ డ్రోన్ దాడులు జరిపింది ఉక్రెయిన్. పేలుళ్లతో కొన్ని ప్రాంతాలు దద్దరిల్లాయి. దాడుల్లో ఇద్దరు మరణించగా పలువురు గాయపడ్డారని రష్యా అధికారులు తెలిపారు. కీలకమైన చమురు రిఫైనరీ, ప్రయాణికుల రైలు, పారిశ్రామిక కేంద్రాలు కూడా దెబ్బతిన్నాయి.దాడుల్లో ఏకంగా 592 ఉక్రెయిన్ డ్రోన్లను తమ వైమానిక రక్షణ వ్యవస్థలు ధ్వంసం చేశాయని రష్యా రక్షణ శాఖ ప్రకటించింది. అయితే ఇంత భారీ సంఖ్యలో డ్రోన్లను అడ్డుకున్నప్పటికీ.. కొన్ని డ్రోన్లు రక్షణ వ్యవస్థలను దాటి లక్ష్యాలను చేరుకున్నాయి.

**చమురు రిఫైనరీపై దాడి**

బెల్గొరోడ్ ప్రాంతంలో ఓ ట్రక్కును ఉక్రెయిన్ డ్రోన్ ఢీకొట్టినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ఒక పౌరుడు మృతి చెందగా.. మరో వ్యక్తి గాయపడ్డాడు. మరోవైపు పెర్మ్ ప్రాంతంలో జరిగిన భారీ డ్రోన్ దాడిలో ఒక వ్యక్తి మరణించినట్లు ఆ ప్రాంత గవర్నర్ దిమిత్రి మహోనిన్ తెలిపారు. ఈ దాడుల్లో రష్యాలోని రోస్తోవ్ ప్రాంతంలోని నోవోషాఖ్టిన్స్క్ చమురు రిఫైనరీ కూడా దెబ్బతిన్నట్లు గవర్నర్ యూరి స్ల్యూసర్ తెలిపారు. ఆ ప్రాంతంలో సుమారు 50 డ్రోన్లను ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే రిఫైనరీలోని కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశారు. రిఫైనరీ వద్ద ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలుస్తోంది.

**రైలు పైనా దాడి**

డ్రోన్ దాడుల ప్రభావం ప్రయాణికుల రైలుపైనా పడింది. రష్యాలోని పలు ప్రాంతాల్లో పారిశ్రామిక సదుపాయాలు కూడా దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. ఒకే రాత్రిలో ఇంత భారీ సంఖ్యలో డ్రోన్లు ప్రయోగించడంపై రష్యా అధికారులు అప్రమత్తమయ్యారు.

**అసలు లక్ష్యం ఏంటి?**

రష్యాలోని చమురు రిఫైనరీలు, పారిశ్రామిక కేంద్రాలు, రవాణా వ్యవస్థలు లక్ష్యంగా దాడులు జరగడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు 592 డ్రోన్లను కూల్చివేశామని రష్యా చెబుతుండగా.. మరోవైపు కొన్ని డ్రోన్లు కీలక ప్రాంతాలను ఎలా చేరుకున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ దాడులతో రష్యా-ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న డ్రోన్ యుద్ధం మరింత తీవ్రంగా మారిన సంకేతాలు కనిపిస్తున్నాయి. అయితే ఈ దాడులకు సంబంధించి ఉక్రెయిన్ నుంచి పూర్తి స్థాయి అధికారిక స్పందన రావాల్సి ఉంది.

# ఒక్క నిద్ర ఆమె జీవితాన్ని మార్చేసింది..

## రూ. 850 కోట్ల పరిహారం!



ఒక టీమ్ బిల్డింగ్ ట్రిప్‌లో జరిగిన చిన్న ఘటన ఓ మహిళా టెక్ ఎగ్జిక్యూటివ్ జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ఉద్యోగం పోయింది..కెరీర్ దెబ్బతింది..ఈ వ్యవహారం బ్రిటన్‌లోని ఎంప్లాయ్‌మెంట్ ట్రిబ్యునల్‌కు చేరింది. ఇక ఈ కేసులో ఆమె కోరుతున్న పరిహారం ఎంతో తెలుసా? ఏకంగా 76 మిలియన్ పౌండ్లు! భారత కరెన్సీలో ఇది సుమారు రూ.850 కోట్లకు పైమాటే. బ్రిటన్ ఎంప్లాయ్‌మెంట్ ట్రిబ్యునల్ చరిత్రలో ఇంత భారీ పరిహారం కోరడం ఇప్పుడు సంచలనంగా మారింది.షానన్ బర్న్ ఏఐ రంగంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసారు. గతంలో ాశ్రీఖఎెని, ాఎట్ వంటి సిలికాన్ వ్యాలీ కంపెనీల్లో పనిచేసిన అనుభవం ఆమె సొంతం. 2022లో ఆమెను +ఉజూశీస సంస్థ కీలక పదవిలో నియమించింది. ఆమెకు ఏడాదికి సుమారు 2.2 లక్షల పౌండ్ల జీతం, అదనంగా బోనస్ కూడా ఇచ్చింది. అయితే 2023 ఏప్రిల్‌లో ఆస్ట్రియాలో జరిగిన కంపెనీ టీమ్ బిల్డింగ్ కార్యక్రమంలో ఊహించని ఘటన చోటుచేసుకుంది. ఆ రోజు ఉద్యోగులు మద్యం సేవించినట్లు ట్రిబ్యునల్‌లో వెల్లడైంది. షానన్ కూడా మద్యం సేవించారు. రాత్రి తన హోటల్ గది తాళం చెవి అందుబాటులో లేకపోవడంతో ఆమె గదిలోకి వెళ్లలేకపోయారు. చివరకు..హోటల్‌లోని సౌనా (ఆవిరి స్నాన గది) లో నిద్రపోవాల్సిన పరిస్థితి వచ్చింది.ఆ ఘటనతో ఉద్యోగానికి ఎండ్ కార్డ్

ఈ ఘటనపై కంపెనీ జజుూ ఆందోళన వ్యక్తం చేసినట్లు ట్రిబ్యునల్‌లో వెల్లడైంది. ముఖ్యంగా ఆమె వృత్తిపరమైన బాధ్యతల విషయంలో సమస్య ఉందని భావించినట్లు సమాచారం. కొద్ది వారాలకే.. అంటే 2023 జూన్‌లో షానన్ ఉద్యోగం కోల్పోయారు. అయితే ఆమె వాదన మాత్రం వేరుగా ఉంది. తనకు ూఱఎఱ ఉందని, దాని కారణంగా వస్తువులు మర్చిపోవడం, వాటిని పోగొట్టుకోవడం వంటి సమస్యలు ఉంటాయని ఆమె ట్రిబ్యునల్‌కు తెలిపారు. అదే సమయంలో టీమ్ ట్రిప్‌లో తనతో పాటు మగ ఉద్యోగులు కూడా మద్యం సేవించినప్పటికీ..తనపై మాత్రమే చర్య తీసుకున్నారని ఆమె ఆరోపించారు.

కోర్టులో కీలక మలుపు

షానన్ తన ఉద్యోగం కోల్పోవడానికి తన వైకల్యమే కారణమని వాదిస్తూ న్యాయపోరాటం ప్రారంభించారు. గత ఏడాది ఇంగ్లాండ్ లోని బర్మింగ్‌హామ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రిబ్యునల్.. ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆమెను వైకల్యం ఆధారంగా వివక్షకు గురి చేసి ఉద్యోగం నుంచి తొలగించినట్లు నిర్ధారించింది. అక్కడితో కథ ముగియలేదు. ఇప్పుడు అసలు సంచలనం మొదలైంది.

రూ.850 కోట్ల పరిహారం ఎందుకు?

ఉద్యోగం పోవడం వల్ల తనకు భారీ ఆదాయ నష్టం జరిగిందని షానన్ చెబుతున్నారు. టెక్ రంగంలో తన కెరీర్ కొనసాగి ఉంటే భవిష్యత్తులో సంపాదించే అవకాశం ఉన్న మొత్తాన్ని లెక్కలోకి తీసుకుని.. మొత్తం 76,071,992 పౌండ్ల పరిహారం కోరుతున్నారు. ఇందులో భవిష్యత్ ఆదాయ నష్టమే సుమారు 59 మిలియన్ పౌండ్లుగా పేర్కొన్నారు. మిగిలిన మొత్తంలో మానసిక వేదన, ఇతర నష్టాలకు సంబంధించిన క్లెయిమ్‌లు ఉన్నాయి.

ఒక మిలియన్ పౌండ్లకు పరిమితం చేయాలని కోరిన కంపెనీ

షానన్ ఇంత భారీ మొత్తాన్ని కోరడాన్ని +ఉజూశీస తీవ్రంగా వ్యతిరేకించింది. ఆమె పరిహారం క్లెయిమ్‌ను ఒక మిలియన్ పౌండ్లకు పరిమితం చేయాలని కంపెనీ ట్రిబ్యునల్‌ను కోరింది. అయితే ట్రిబ్యునల్ ఆ అభ్యర్థనను తిరస్కరించింది. ఇంత భారీ పరిహారం సాధారణంగా బ్రిటన్‌లో చాలా అరుదని ట్రిబ్యునల్ పేర్కొంది. అమెరికాలో ఇలాంటి భారీ పరిహారాలు ఎక్కువని కూడా వ్యాఖ్యానించింది. అయితే ప్రస్తుతం షానన్ కోరుతున్న మొత్తం తప్పకుండా లభిస్తుందని ట్రిబ్యునల్ చెప్పలేదు. ఈ మొత్తానికి సంబంధించిన క్లెయిమ్‌ను ఈ దశలోనే తిరస్కరించేంత ఆధారాలు లేవని మాత్రమే తెలిపింది.

# ఉప్పొంగుతున్న బాగమతి నది..

## పొంచి ఉన్న వరద ముప్పు.. నేపాల్‌లో మరోసారి హై అలర్ట్



ఇటీవలే భారీ వరదలకు అతలాకుతలమైన నేపాల్ మరోసారి ప్రమాదం అంచున ఉంది. స్థానిక బాగమతి నది ఉప్పొంగుతుండటంతో వరద ముంచుకొస్తుందేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నేపాల్‌లో ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అనేక నదుల్లో నీటి ప్రవాహం భారీగా పెరిగింది. ముఖ్యంగా బాగమతి నదికి భారీ వరద నీరు చేరడంతో ఉప్పొంగి ప్రవహిస్తోంది.నదీ తీరంలోని అనేక ఇండ్లను తాకుతూ నీళ్లు ప్రవహిస్తున్నాయి. ఇంకొంచెం నీటి ప్రవాహం పెరిగితే, ఒడ్డున ఉన్న ప్రాంతాలను వరద ముంచెత్తే అవకాశం ఉంది. అందుకే, ప్రభుత్వం హైఅలర్ట్ ప్రకటించింది. శుక్రవారం పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. భారీ వర్షాలకు కొండ చరియలు కూడా విరిగిపడే అవకాశం ఉంది. రాజధాని ఖాట్మండ్, ఇతర ప్రాంతాలను కలిపే రహదారులపై నీరు ప్రవహిస్తోంది. ఈ ప్రాంతాల్లోనే వరదలు, కొండచరియల ముప్పు పొంచి ఉంది. పృథ్వి హైవే, బీపీ హైవే, కంటి లోక్‌పాత్ హైవేలు అనేక చోట్ల నీట మునిగాయి. రోడ్లపై వరద నీరు చేరడంతోపాటు, కొన్ని చోట్ల కొండ చరియలు విరిగి పడటంతో రహదారులు స్తంభించాయి.

దీంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఒకపక్క బాగమతి నది ఉప్పొంగుతుంటే.. మరోపక్క భారీ నుంచి అతి భారీవర్షాలు పడే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ తెలిపింది. అలాగే, రోషి నది కూడా ఉప్పొంగి ప్రవహిస్తోంది. దీంతో అనేక చోట్ల రోడ్లు కొట్టుకుపోయాయి. ఈ నేపథ్యంలో అధికారులు ట్రాఫిక్‌ను మళ్లించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. సెప్టెంబర్ 25-27 వరకు భారీ వర్షాలు పడుతాయని, వరదలు, కొండ చరియలు విరిగిపడటానికి అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది.

# చనిపోయిందనుకున్నారు..

## శవపేటిక నుంచి శబ్దాలు.. షాకైన కుటుంబం



చనిపోయిందని భావించారు.. అంత్యక్రియలకు ఏర్పాట్లు చేశారు. బంధువులు చివరిసారిగా ఆమెను చూసేందుకు వచ్చే వరకు మృతదేహాన్ని శవపేటికలో ఉంచారు. కానీ మరుసటి రోజు అనూహ్య ఘటన చోటుచేసుకుంది. శవపేటికలో నుంచి ఓ వింత శబ్దం వినిపించింది. కుటుంబ సభ్యులు భయంతో వెంటనే శవపేటికను తెరిచి చూడగా.. వారికి నమ్మశక్యం కాని దృశ్యం కనిపించింది. లోపల ఉన్న వృద్ధురాలు శ్వాస తీసుకుంటోంది! చైనాలో జరిగిన ఈ ఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది.చైనాలోని హెబెయ్ ప్రావిన్స్‌కు చెందిన 70 ఏళ్ల వృద్ధురాలు కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెకు పదేళ్లకు పైగా సెరెబ్రల్ థ్రాంబోసిస్ సమస్య ఉంది. అంతేకాదు క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు చైనా మీడియా కథనాలు తెలిపాయి. ఆమె ఆరోగ్యం మరింత క్షీణించడంతో క్యాన్సర్‌కు చికిత్స చేయడం సాధ్యం కాదని వైద్యులు కుటుంబ సభ్యులకు చెప్పినట్లు సమాచారం. దీంతో ఆమెను ఇంటికి తీసుకెళ్లి కుటుంబ సభ్యులే సంరక్షిస్తున్నారు.

చనిపోయిందనుకుని.. శవపేటికలో పెట్టారు

సెప్టెంబర్ 8వ తేదీన కుటుంబ సభ్యులు ఆమెను పరిశీలించగా వారికి ఆమెలో ఎలాంటి కదలిక కనిపించలేదు. దాంతో ఆమె చనిపోయిందని భావించారు. వేరే ప్రాంతాల్లో ఉన్న బంధువులు వచ్చి చివరిసారిగా ఆమెను చూసుకునే వరకు మృతదేహాన్ని భద్రపరచాలని నిర్ణయించారు. అందుకోసం రిఫ్రిజరేషన్ సౌకర్యం ఉన్న శవపేటికలో ఆమెను ఉంచారు. అంతా ముగిసిపోయిందని కుటుంబ సభ్యులు భావించారు. కానీ మరుసటి రోజు సాయంత్రం ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది.

శవపేటిక లోపల నుంచి శబ్దం!

వృద్ధురాలి కోడలికి శవపేటిక లోపలి నుంచి చిన్నగా శబ్దం వినిపించింది. మొదట ఆమెకు ఏం జరుగుతుందో అర్థం కాలేదు. అనుమానం రావడంతో వెంటనే కుటుంబ సభ్యులను పిలిచింది. శవపేటికను తెరిచి చూడగా.. వృద్ధురాలు శ్వాస తీసుకుంటున్నట్లు గుర్తించారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను బయటకు తీసుకొచ్చారు. కొంతసేపటికి ఆమె కళ్లు కూడా తెరిచినట్లు బంధువులు తెలిపారు. అయితే ఆమె చాలా బలహీనంగా ఉండటంతో ఆహారం, నీళ్లు కూడా సరిగా తీసుకోలేకపోయారు.

స్థానిక మీడియా కథనాల ప్రకారం..వృద్ధురాలిని డీప్ ఫ్రీజ్‌లో కాకుండా సాధారణ రిఫ్రిజరేటెడ్ శవపేటికలో ఉంచారు. ఆమె పరిస్థితిని వైద్యపరంగా 'అప్పారెంట్ డెత్' (ూజూజూఋతీవత్ ఱఎఫ్త్ర) అని పిలుస్తారని వైద్యులు తెలిపారు. ఆమె అపస్మారక స్థితిలో ఉండటంతో .. అలాంటి పరిస్థితుల్లో శ్వాస తీసుకోవడం, గుండె కొట్టుకోవడం చాలా బలహీనంగా మారే అవకాశం ఉంది.

కొన్ని గంటలకే విషాదం..


అయితే కుటుంబ సభ్యులు ఆశ్చర్యంతో ఆమె బతికే ఉన్నట్లు గుర్తించినప్పటికీ.. ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు.సెప్టెంబర్ 11న, శ్వాస తీసుకుంటున్నట్లు గుర్తించిన కొన్ని గంటలకే ఆమె మళ్లీ కన్నుమూశారు. అనంతరం సెప్టెంబర్ 13న అంత్యక్రియలు నిర్వహించారు.

సోషల్ మీడియాలో చర్చ

ఈ ఘటనను కుటుంబ సభ్యుల్లో ఒకరు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో విషయం బయటకు వచ్చింది. కొందరు నెటిజన్లు ఘటన నిజమేనా అంటూ అనుమానాలు వ్యక్తం చేశారు. అయితే కుటుంబ సభ్యులు మాత్రం తమ బంధువుకు సంబంధించిన విషయాన్ని కల్పించి చెప్పాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. కొంతమంది స్థానికులు కూడా ఈ ఘటన గురించి విన్నట్లు చెప్పినట్లు సమాచారం. ఈ ఘటనతో తీవ్ర అనారోగ్యంతో ఉన్న వ్యక్తుల్లో ప్రాణ లక్షణాలు చాలా బలహీనంగా ఉన్నప్పుడు మరణాన్ని నిర్ధారించేందుకు సరైన వైద్య పరీక్షలు ఎంత ముఖ్యమో మరోసారి చర్చకు వచ్చింది.

# ల్యాండ్ అవుతుండగా ఊడిన విమానం టైర్..

## రన్‌వే పై భీకర టెన్షన్



విమానం రన్‌వేపై దిగుతోంది..అంతలోనే ఊహించని ఘటన.. ల్యాండింగ్ సమయంలో విమానం కుడి టైర్ ఊడిపోయింది. టైర్ దూరంగా పడటంతో ఆ కుదుపుకు ప్రయాణికులు భయంతో వణికిపోయారు. అయితే పైలట్ అప్రమత్తంగా వ్యవహరించడంతో విమానంలోని 16 మంది సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన నేపాల్‌లోని జుఫాల్ విమానాశ్రయంలో గురువారం చోటుచేసుకుంది.సీతా ఎయిర్‌లైన్స్‌కు చెందిన చిన్న విమానం నేపాల్‌గంజ్ నుంచి డోల్పాకు బయలుదేరింది. విమానంలో 13 మంది ప్రయాణికులు, ముగ్గురు సిబ్బంది ఉన్నారు. జుఫాల్ విమానాశ్రయంలో ల్యాండింగ్ చేస్తున్న సమయంలో విమానం కుడివైపు టైర్ అకస్మాత్తుగా ఊడిపోయింది. దీంతో విమానం పెద్ద కుదుపుతో రన్‌వేపైనే ఆగిపోయింది.

**పైలట్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం**

విమానం టైర్ ఊడిపోయిన వెంటనే పైలట్ ఇంజిన్‌ను వెంటనే ఆపేశారు. దీంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారకుండా నియంత్రించగలిగారు. విమానం రన్‌వేపైనే నిలిచిపోయినప్పటికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు .విమానానికి కూడా పెద్దగా నిర్మాణపరమైన నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. టైర్ ఊడి విమానం అదుపు తప్పి ఉంటే పరిస్థితి మరింత తీవ్రంగా మారే అవకాశం ఉండేది. అయితే పైలట్ వేగంగా స్పందించడంతో పెను ప్రమాదం తప్పింది.

**విమానం రన్‌వేపైనే.. విమాన రాకపోకలు నిలిపివేత**

అయితే ప్రమాదం తప్పినా మరో సమస్య మొదలైంది. విమానం రన్‌వే పైనే నిలిచిపోవడంతో జుఫాల్ విమానాశ్రయంలో అన్ని విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు. విమానాశ్రయానికి వస్తున్న నేపాల్ ఆర్మీకి చెందిన ఓ విమానం అత్యవసర పరిస్థితి కారణంగా తిరిగి వెళ్లాల్సి వచ్చింది. రన్‌వేపై ఉన్న విమానాన్ని తొలగించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. విమానాన్ని రిపేర్ చేసేందుకు అవసరమైన సాంకేతిక నిపుణులను హెలికాప్టర్ ద్వారా తరలించారు. విమానం తొలగించిన తర్వాత రన్‌వే పై మరమ్మత్తు పనులు పూర్తి చేసి విమాన సర్వీసులను సాధారణ స్థితికి తీసుకొచ్చారు. ల్యాండింగ్ సమయంలో టైర్ ఊడిపోయి ఒక్కసారిగా ఉత్కంఠ రేపిన ఈ ఘటనలో పైలట్ అప్రమత్తతతో 16 మంది సురక్షితంగా బయటపడటం ఊరట కలిగించింది

# షాట్‌పుట్‌లో మన్‌ప్రీత్ కంచుమోత..



నగోయలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత షాట్‌పుటర్ మన్‌ప్రీత్ కౌర్ మెరిసింది. అంచనాలు నిలబెట్టుకున్న తను మహిళల విభాగంలో కాంస్యం కొల్లగొట్టింది. శుక్రవారం ఫైనల్లో ఇనుప గుండును 17.17 మీటర్ల దూరం విసిరిన మన్‌ప్రీత్ కంచు మోత మోగించింది. తద్వారా ఆసియాడ్ మహిళల షాట్‌పుట్‌లో పతకం సాధించిన మూడో భారత మహిళగా చరిత్రకెక్కింది తను. అథ్లెటిక్స్‌లో పతకం గెలుస్తారనుకున్న గురిందెర్వీర్ సింగ్, అనిమేశ్ కుజుర్‌లు 100 మీటర్ల పరుగులో తేలిపోయారు.జపాన్ ఆతిథ్యమిస్తున్న ఆసియా క్రీడల్లో ఆరో రోజు భారత్ ఖాతాలో మూడో పతకం చేరింది. షూటర్లు పసిడి వెలుగులు విరజిమ్మగా.. టేబుల్ టెన్నిస్‌లో మిక్స్‌డ్ డబుల్స్ టీమ్ కాంస్యం పట్టేసింది. వీరి స్ఫూర్తితో షాట్‌పుటర్ మన్‌ప్రీత్ కౌర్ పోడియం మీద సగర్వంగా నిలబడింది. శుక్రవారం జరిగిన ఫైనల్లో సత్తా చాటిన తను.. ఇనుప గుండును 17.17 మీటర్ల దూరం విసిరింది. మూడో స్థానం సాధించి.. కాంస్యంతో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించింది మన్‌ప్రీత్.పురుషుల 100 మీటర్ల పరుగులో భారత అథ్లెట్లు గురిందెర్వీర్ సింగ్, అనిమేశ్ కుజుర్‌లు విఫలమయ్యారు. క్వాలిఫయింగ్ రౌండ్‌లో మెరిసిన వీరు.. సెమీస్‌లో మాత్రం నిరాశపరిచారు. గురిందెర్వీర్ 10.32 సెకన్లతో ఐదో స్థానంలో నిలవగా.. అనిమేశ్ 10.38 సెకన్లతో ఏడో స్థానంలో ఉండి ఫైనల్ బెర్తు చేజార్చుకున్నారు. దాంతో.. ఈ ఈవెంట్‌లో భారత పోరాటం ముగిసింది. కచ్చితంగా పతకం సాధిస్తారనుకున్న వీరిద్దరూ ఉత్త చేతులతోనే స్వదేశం రానున్నారు.

# హిట్ మ్యాన్ రీఎంట్రీతో స్టార్ ఓపెనర్‌కు నో ఛాన్స్..

## భారత్-విండీస్ తుది జట్టు ఇదే

భారత క్రికెట్ జట్టు త్వరలో వెస్టిండీస్‌తో తలపడేందుకు సిద్ధమైంది. ఇరు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ సెప్టెంబర్ 27న తిరువనంతపురంలో జరగనుంది. ఈ మ్యాచ్ కోసం ఇప్పటికే రెండు జట్లు వేదికకు చేరుకున్నాయి. స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ ప్రస్తుతం జపాన్‌లో జరిగే ఆసియా క్రీడల జట్టుతో బిజీగా ఉండటం వల్ల ఈ సిరీస్‌కు అందుబాటులో లేడు. అయినప్పటికీ సెలక్టర్లు అత్యంత పటిష్టమైన స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. రుతురాజ్ గైక్వాడ్, ఆకిబ్ నబీ, నమన్ ధీర్ వంటి యువ ఆటగాళ్లతో పాటు, అనుభవజ్ఞుడైన రవీంద్ర జడేజా కూడా వన్డే జట్టులోకి రీఎంట్రీ ఇచ్చారు.

**రోహిత్ శర్మ రాకతో జైస్వాల్‌కు నో ఛాన్స్**

బలమైన జట్టు అందుబాటులో ఉన్నప్పటికీ కొంతమంది స్టార్ ఆటగాళ్లకు తొలి వన్డే తుది జట్టులో స్థానం దక్కడం సందేహంగా మారింది. ముఖ్యంగా అద్భుతమైన ఫామ్‌లో ఉన్న యశస్వి జైస్వాల్ బెంచ్‌కే పరిమితం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కెప్టెన్ రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ ఓపెనర్లుగా బరిలోకి దిగడం ఖాయం కాగా, మూడో స్థానంలో విరాట్ కోహ్లీ ఆడనున్నాడు. దీంతో టాప్ ఆర్డర్‌లో యశస్వి జైస్వాల్‌కు చోటు దక్కడం కష్టంగా మారింది. ఇప్పటివరకు ఆడిన 6 వన్డేల్లో 71.25 సగటుతో 285 పరుగులు చేసిన జైస్వాల్ వంటి ఫామ్ ఉన్న ఆటగాడు ఉండటం ఆశ్చర్యకరమే.



**నంబర్-4 స్థానంలో రుతురాజ్ గైక్వాడ్‌కు ఛాన్స్?**

శ్రేయస్ అయ్యర్ గైర్హాజరీలో ఖాళీ అయిన నంబర్-4 స్థానంలో ఎవరికి అవకాశం దక్కుతుందనే ఉత్కంఠ నెలకొంది.

ఈ పొజిషన్‌లో రుతురాజ్ గైక్వాడ్‌ను ఆడించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గైక్వాడ్ ఇప్పటివరకు 9 వన్డేల్లో 228 పరుగులు సాధించాడు. ఇక వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్ ఐదో స్థానంలో బరిలోకి దిగనుండగా, ఆల్ రౌండర్ల కోటాలో నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా జట్టుకు అదనపు బలాన్ని చేకూర్చనున్నారు.

**భారత తుది జట్టు(అంచనా)**

వెస్టిండీస్‌తో జరగనున్న తొలి వన్డే మ్యాచ్ కోసం టీమిండియా అంచనా వేసిన తుది జట్టు వివరాలు ఇలా ఉన్నాయి:

రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, రుతురాజ్ గైక్వాడ్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గురునూర్ బ్రార్.

# వరల్డ్‌కప్‌లో ఆ ఇద్దరు చాలా ముఖ్యం..

## శాంసన్‌పై వేటుతో నిద్రపోలే..!

ఐసీసీ పురుషుల వన్డే ప్రపంచకప్ 2027 సన్నాహకాల్లో ఉన్న భారత జట్టు స్వదేశంలో వెస్టిండీస్‌తో సిరీస్ ఆడనుంది. ఆదివారం తిరువనంతపురంలో తొలి మ్యాచ్‌తో మూడు వన్డేల సిరీస్ మొదలవ్వనుంది. వరల్డ్‌కప్‌లో టీమిండియా కాంబినేషన్ల కూర్పు కోసం ఇదే సరైన సమయం. దాంతో.. హెడ్‌కోచ్ గౌతం గంభీర్ మీడియాతో మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశాడు. జియో హాట్‌స్టార్ ఇంటర్వ్యూలో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, ప్రధాన పేసర్ జస్ప్రీత్ బుమ్రా గురించి చెబుతూ.. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికాలో వారిద్దరూ జట్టుకు చాలా ముఖ్యం అన్నాడు గౌతీ.వచ్చే ఏడాది వన్డే ప్రపంచక స్క్వాడ్‌లో ఉండేది ఎవరు? అనేది ఉత్కంఠ రేపుతోంది. సీనియర్లు, జూనియర్లతో పటిష్టమైన బృందం ఎంపిక ప్రక్రియను భారత కోచ్ గౌతం గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కసరత్తు ఆరంభించారు. ప్రస్తుతం సన్నాహక సిరీస్‌లపై దృష్టి సారించిన టీమిండియా.. స్వదేశంలో విండీస్‌ను ఢీకొడుతోంది. ఆదివారం తొలి వన్డే జరుగున్నందున హెడ్‌కోచ్ గంభీర్ జియో హాట్‌స్టార్ ఇంటర్వ్యూలో సీనియర్లు హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీ20 ఓపెనర్ సంజూ శాంసన్‌పై వేటు వేయడం తన కోచింగ్ కెరీర్లో తీసుకున్న కఠిన నిర్ణయమని గౌతీ అన్నాడు.'వరల్డ్‌కప్ వంటి మెగా టోర్నీకి సగం ఫిట్‌నెస్‌తో వెళ్లలేం. హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రాలు దక్షిణాఫ్రికాలో భారత జట్టుకు చాలా కీలకం. చాలా కొన్ని జట్లకు మాత్రమే హార్దిక్ లాంటి ఆటగాడు ఉన్నాడు.

అతడు పది ఓవర్లు బౌలింగ్ చేయగలడు. అలానే 6, 7వ స్థానాల్లో విలువైన పరుగులు చేస్తాడు. అందుకని మా ఫోకస్ అంతా అతడిమీదే. అయితే.. మెగా టోర్నీకి ముందు అతడు మరిన్ని మ్యాచ్‌లు ఆడాలి. ఐపీఎల్ 19వ సీజన్ తర్వాత పాండ్యా పెద్దగా క్రికెట్ ఆడలే. వన్డేల విషయంలో..





అతడిని తీసుకోవాల్సి వస్తే.. కచ్చితంగా సన్నద్ధత సరిపోదు. పాండ్యా టీ20లు ఆడేసి.. వన్డేల్లోకి వస్తాడు. కానీ, వరల్డ్‌కప్ ముందు సరిపోను గేమ్ టైమ్ ఉండడం చాలా చాలా ముఖ్యం.బుమ్రా విషయానికొస్తే.. అతడిని ఎన్ని వన్డేలు ఆడిస్తామనేది కీలకం.

అదే సమయంలో టెస్టు క్రికెట్టూ ముఖ్యమే. కాబట్టి బుమ్రాను ఆడించడం, అతడిపై పని భారం పడకుండా చూసుకోవడం ప్రధానమే అని గంభీర్ వెల్లడించాడు. ఇక ఇంగ్లండ్ పర్యటనలో సంజూ శాంసన్‌ను తప్పించడం నిజంగా బాధేసింది. టీ20 వరల్డ్‌కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు గెలిచిన ఆటగాడిని.. ఆ తర్వాతి మూడు నాలుగు మ్యాచ్‌లకే బెంచ్‌పై కూర్చోబెట్టిన రోజు నేను నిద్రపోలేదు. చెప్పాలంటే నా టీ20 కోచింగ్ కెరీర్‌లో తీసుకున్న అత్యంత కఠినమైన నిర్ణయం ఇదే అని గంభీర్ పేర్కొన్నాడు.

ఐర్లాండ్‌లో విఫలమైన సంజూను కాదని వైభవ్ సూర్యవంశీకి అవకాశం ఇవ్వాలనే నిర్ణయంపై కూడా గంభీర్ మాట్లాడాడు. ప్రతిభావంతుడైన వైభవ్‌ను ఆడించడం సబబే. కానీ కొన్నిసార్లు బాగా ఆడిన వాళ్లు కూడా అవకావం కోసం ఎదురుచూడాల్సిందే. అదే సమయంలో.. మీడియాలో వచ్చే వదంతలను బట్టి.. తుది జట్టును ఎంపిక చేయం. స్క్వాడ్‌లో ఉన్నవారిలో ఎవరు మ్యాచ్‌ను గెలిపించగలరు? అనే దానిని బట్టి పదకొండు మందిని ఎంపిక చేస్తాం అని హెడ్‌కోచ్ వివరించాడు.

# టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో కాంస్యం..







ఆసియా క్రీడల్లో ఆరో రోజు భారత బృందానికి వరసగా షాక్‌లు తగిలాయి. అంతర్జాతీయ వేదికల్లో దుమ్మురేపుతున్న భారత డబుల్స్ ద్వయం తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. ఫేవరెట్ అయిన సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టిల జోడీని థాయ్‌లాండ్ జంట చిత్తు చేసింది. ఇక కామన్వెల్త్ క్రీడల్లో పతకంతో మెరిసిన బాక్సర్ ప్రీతి పవార్ (గ్రాతీవవ్‌ఱ్రాఖుఝుతీ) సైతం 16వ రౌండ్‌లోనే నిష్క్రమించింది. అయితే.. టేబుల్ టెన్నిస్ మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత ద్వయం అదరగొట్టింది. మనుష్ షా, దియా చిటాలేలు చైనా జంటను చిత్తు చేసి కాంస్యంతో మురిసింది.జపాన్ వేదికగా జరుగుతున్న పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత స్టార్ డబుల్స్ జంట సాత్విక్ సాయిరాజ్ -- చిరాగ్ శెట్టి పోరాటం ముగిసింది. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన ఈ జంట పురుషుల విభాగంలో పతకం గెలుస్తారనుకుంటే తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో పీరట్చాయ్ సుఖ్‌ఫున్ -- పక్కాపొన్ తీరరాత్సకుల్(థాయ్‌లాండ్) ద్వయం దూకుడు ముందు భారత జోడీ నిలవలేకపోయింది. మొదటి సెట్‌ను 21-12తో గెలుపొందిన సాత్విక్ -- చిరాగ్ జంట ఆపై తడబడింది. గొప్పగా పుంజుకున్న థాయ్ షట్లర్లు.. వరసగా 21-19, 21-14తో రెండు సెట్లలో సత్తా చాటారు. దాంతో.. సాత్విక్ -- చిరాగ్ జోడీ నిరాశతో టోర్నీని వీడింది.

**కాంస్య గర్జన**

టేబుల్ టెన్నిస్‌లో వ్యక్తిగతంగా విఫలమైన భారత బృందం.. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో చెలరేగింది. మనుషా షా, దియా చిటాలే బృందం సెమీస్‌లో ఓడినా కాంస్యం పట్టేసింది. శుక్రవారం చైనా జంట వాంగ్ చుకిన్ -- సున్ ఇంక్షా ధాటికి మనుషా, దియా సమాధానం ఇవ్వలేకపోయారు. మ్యాచ్‌లో సంపూర్ణ ఆధిపత్యం చెలాయించిన చైనా జోడీ.. 11-5, 11-8, 11-8తో గెలుపొంది ఫైనల్లో అడుగుపెట్టింది.

**ప్రీతి పంచ్ అదరలే**

ఇటీవలే కామన్వెల్త్ క్రీడల్లో పసిడి పతకం కొల్లగొట్టిన ప్రీతి పవార్ ఆసియా క్రీడల్లో మాత్రం అంచనాలు అందుకోలేదు. మహిళల 54 కిలోల విభాగంలో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ప్రీతి తొలి రౌండ్‌లోనే అనూహ్యంగా కంగుతిన్నది. ఉత్తర కొరియా బాక్సర్ చొల్ మి పాంగ్ ధాటికి వరసగా రెండు రౌండ్లలో తేలిపోయిన భారత స్టార్ ఓటమితో నిరాశపరిచింది. గత ఆసియాడ్‌లో కాంస్యంతో మెరిసిన తను.. ఈసారి ఉత్త చేతులతోనే స్వదేశం రానుంది.



# భారత గడ్డపై విండీస్ చెత్తాట..

**24 ఏళ్లలో ఒక్క వన్డే సిరీస్ గెలవలే..!**

స్వదేశంలో భారత జట్టును ఓడించడం ఏ జట్టుకైనా కష్టమే. ఇటీవల కాలంలో కొన్ని మ్యాచుల్లో ఓడినా.. సొంతగడ్డపై టీమిండియా గర్జించే పులిలాంటిది. వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ సన్నాహకాల్లో ఉన్న భారత్.. మూడు వన్డేల సిరీస్‌లో వెస్టిండీస్‌ను ఢీ కొడుతోంది. తిరువనంతపురంలో తొలి మ్యాచ్‌తో సిరీస్ షురూ కానుంది. ఇప్పటికే విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌లు నెట్స్‌లో బ్యాటింగ్ సరి చూసుకుంటున్నారు. అయితే.. గత 24 ఏళ్లలో విండీస్ ఒక్క సిరీస్ కూడా గెలవలేదు. దాంతో.. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాలంటే షాయ్ హోప్ బృందం సర్వశక్తులు ఒడ్డాల్సిందే.భారత పర్యటనలో ప్రతిసారి ఓటమిని వెంటేసుకునే వెస్టిండీస్ మరోసారి వచ్చేసింది. గత 24 ఏళ్ల ఒక్కటంటే ఒక్క వన్డే సిరీస్ కూడా గెలుపొందని విండీస్ ఈసారి పక్కా వ్యూహంతో ఆడాలనుకుంటోంది. చివరిసారిగా 2002లో విజయం సాధించిన కరీబియన్ టీమ్ చరిత్రను పునరావృతం చేయాలనే పట్టుదలతో ఉంది. తిరువనంతపురంలో ఆదివారం తొలి మ్యాచ్ ఉన్నందున కోచ్ డారెన్ సమీ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యాలు చేశాడు.'భారత్‌లే మేము 24 ఏళ్లుగా ఒక్క సిరీస్ కూడా గెలవలే. కాబట్టి.. చరిత్రను తిరగరాసేందుకు ఈ పర్యటన మాకు అద్భుత అవకాశం. మాకు మేమ సవాల్ విసరుకుంటూ.. వన్డేల్లో మేము ఎక్కడ ఉన్నామో తెలుసుకునేందుకు ఈ సిరీస్ ఉపయోగపడనుంది. అందుకని టీమిండియాపై మంచి ప్రదర్శన కనబరిచి 24 ఏళ్లుగా అందని ద్రాక్షలా ఊరిస్తున్న వన్డే సిరీస్‌ను పట్టేయాలని అనుకుంటున్నాం' అని సమీ పేర్కొన్నాడు.





**4-3తో విజయం**

ఒకప్పుడు మేటి జట్టుగా ప్రపంచ క్రికెట్‌ను శాంసించిన వెస్టిండీస్ ఈమధ్య దారి తప్పింది. స్టార్ ఆటగాళ్లు ఫ్రాంచైజీ లీగ్స్‌కు ప్రధాన్యమివ్వడం, బోర్డుతో విబేధాలు.. వంటివి విండీస్ క్రికెట్‌ను నాశనం చేశాయి. ఈ పరిస్థితుల్లో.. నేరుగా వన్డే ప్రపంచకప్ పోటీలకు అర్హత సాధించలేదు కరీబియన్ టీమ్. ఫలితంగా.. వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్ ఆడనుంది. చివరిసారిగా భారత గడ్డపై 2002లో వన్డే సిరీస్ గెలుపొందింది విండీస్. అప్పుడు 7 మ్యాచ్‌ల సిరీస్‌ను 4-3తో సొంతం చేసుకుందీ మాజీ వరల్డ్ ఛాంపియన్.

# ‘కాకా’ డబ్బింగ్ షురూ..



డైరెక్టర్ బాబీ (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘కాకా’. ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ వేగం పెంచారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన డబ్బింగ్ పనులు పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఈ చిత్రంలో మెగాస్టార్ చిరంజీవి కదిరి కాళీదాస్ పాత్రలో నటిస్తుండగా, అన్షురా రాజన్, నివేతా పేతురాజ్, సునీల్, గెటప్ శ్రీను, కన్నడ నటి రచిత రామ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె. నారాయణ ఈ సినిమాను నిర్మిస్తుండగా, ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. సినిమా షూటింగ్ మరియు పోస్ట్-ప్రొడక్షన్ పనులను ఏకకాలంలో జరుపుతూ చిత్ర యూనిట్ ఫుల్ స్పీడ్‌తో దూసుకెళ్తోంది. బాక్సాఫీస్ వద్ద ఒక సరికొత్త రికార్డును సృష్టించే లక్ష్యంతో ‘ది బ్లడీ బెంచ్‌మార్క్’ అనే క్యాప్షన్‌తో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇక ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను 2027 జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా అత్యంత వైభవంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.



# కసిగా మంట పెట్టేలా..



బాలీవుడ్ మోస్ట్ అవేటెడ్ క్రేజీ ప్రాజెక్ట్ ‘లవ్ అండ్ వార్’ సినిమాకు సంబంధించిన అప్‌డేట్స్ ఒక్కొక్కటిగా ప్రేక్షకులను అలరిస్తున్నాయి.

ఇప్పటికే ఈ సినిమా నుంచి రణ్‌బీర్ కపూర్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా ఆలియా భట్ ఫస్ట్ లుక్‌ను అధికారికంగా విడుదల చేసింది. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు. ఆగ్ భీ, దిల్ కీ జాన్ భీ! అంటూ మేకర్స్ రిలీజ్ చేసిన ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్, వికీ కౌశల్ కూడా ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. స్టార్ హీరో హీరోయిన్ల కాంబినేషన్ కావడంతో ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక అన్నీ అనుకున్నట్లుగా జరిగితే, ఈ భారీ బడ్జెట్ రొమాంటిక్ డ్రామా సినిమాను 2027 జనవరి 21న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. థియేటర్లలో కలుద్దాం! అంటూ చిత్ర బృందం ఇచ్చిన అప్‌డేట్‌తో అభిమానులు ఫుల్ ఖుషి అవుతున్నారు.

# ‘ది ప్యారడైజ్’లో కయాదు లోహర్ పాత్రపై విమర్శలు..

నేచురల్ స్టార్ నాని నటించిన ‘ది ప్యారడైజ్’కు విడుదల తర్వాత మిశ్రమ స్పందన వస్తోంది. సినిమా కథ, నాని నటన, యాక్షన్ సన్నివేశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నప్పటికీ.. ఈ చిత్రంలో కయాదు లోహర్ పోషించిన సుబ్బు పాత్ర మాత్రం ప్రత్యేకంగా చర్చకు వచ్చింది. ముఖ్యంగా ఆ పాత్రను దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన విధానంపై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సినిమాలో సుబ్బు పాత్రకు సినీ నటి కావాలనే కోరిక ఉంటుంది. తల్లి వద్దని వారించినా మద్రాస్ వెళ్లి సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నిస్తుంది. అయితే అనుకున్న స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతుంది. అదే సమయంలో తన తండ్రి చేసిన అప్పుల కారణంగా కుటుంబం ఎదుర్కొంటున్న అవమానాలను చూస్తుంది. ఎలాగైనా ఆ అప్పులు తీర్చాలని నిర్ణయించుకున్న సుబ్బు.. డబ్బు కోసం బీ గ్రేడ్ చిత్రాల్లో నటించడం ప్రారంభిస్తుంది. ఇక్కడే ‘ది ప్యారడైజ్’లోని కొన్ని సన్నివేశాలపై ప్రేక్షకుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సుబ్బు నటించే బీ గ్రేడ్ చిత్రాలకు ‘చుక్క చిత్రాలు’ అనే పేరు పెట్టడం, వాటిని ప్రదర్శించే సన్నివేశాల్లో హీరోయిన్ పాత్రను చూపించిన తీరు అవసరానికి మించి గ్లామర్‌ను ప్రధానంగా చూపించిందని కొందరు ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. కథలో ఆ పాత్ర ఎదుర్కొంటున్న బాధ, పరిస్థితుల తీవ్రత ప్రేక్షకులకు బలంగా కనెక్ట్ కావాల్సిన చోట.. కొన్ని సన్నివేశాలు వేరే విధంగా స్పందన తెచ్చుకున్నాయని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. మరోవైపు సుబ్బు నడుముపై ఉండే సీతాకోకచిలుక



టాటూ కూడా కథలో కీలకంగా ఉపయోగించారు. బీ గ్రేడ్ చిత్రాల్లో ఆమె ముఖాన్ని చూపించకుండా ఆ టాటూ ద్వారా గుర్తుపట్టేలా సన్నివేశాలను రూపొందించారు. అయితే ఆ విషయాన్ని హీరో తెలుసుకున్న తర్వాత వచ్చే సన్నివేశంలో నాని చెప్పే కొన్ని సంభాషణలపైనా విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా మహిళలను అవమానించేలా అనిపించే పదజాలాన్ని ఉపయోగించడంపై కొందరు ప్రేక్షకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి సుబ్బు పాత్ర వెనుక ఉన్న ఉద్దేశం భావోద్వేగంగా ప్రేక్షకులను కదిలించడమే అయి ఉండొచ్చనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. కుటుంబ అప్పులు తీర్చడానికి ఒక యువతి తనకు ఇష్టం లేని మార్గంలోకి వెళ్లాల్సి రావడం, ఆ తర్వాత ఆ విషయం హీరోకు తెలియడం వంటి అంశాలతో బలమైన భావోద్వేగాన్ని పండించాలని దర్శకుడు ప్రయత్నించినట్లు కనిపిస్తోంది. అయితే ఆ సన్నివేశాల చిత్రీకరణ కారణంగా ఆశించిన భావోద్వేగం కంటే భిన్నమైన స్పందన వచ్చిందని కొందరు ప్రేక్షకులు అంటున్నారు. సోషల్ మీడియాలో కొంతమంది కయాదు లోహర్ సన్నివేశాలనే సినిమాకు సంబంధించిన చర్చలో ప్రధాన అంశంగా మార్చుకుని ట్రోల్ చేస్తున్నారు. మరికొందరు మాత్రం ఆ పాత్రను విమర్శించాల్సిన అవసరం లేదని, పాత్రను ఎలా రాశారు, ఎలా చూపించారు అనే అంశంపైనే చర్చ జరగాలని అంటున్నారు. అంటే.. విమర్శల ప్రధాన కేంద్రం కయాదు లోహర్ కాదు, ఆమె పాత్రను తెరపై ఆవిష్కరించిన విధానమే అన్నది వారి అభిప్రాయం.


# నటుడు సంపూర్ణేష్ బాబుకు క్షమాపణలు చెప్పిన జర్నలిస్ట్ నాగేంద్ర కుమార్!



టాలీవుడ్ నటుడు సంపూర్ణేష్ బాబు ఇటీవల ‘ది ప్యారడైజ్’ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా జర్నలిస్ట్ నాగేంద్ర కుమార్ నిర్వహించిన ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అయితే ఈ ఇంటర్వ్యూలో జర్నలిస్ట్ మాట్లాడిన తీరు వివాదాస్పదమైంది. ఇంటర్వ్యూ సమయంలో “అసలు ఈ ఫేస్‌తో హీరో అవుదామని ఇండస్ట్రీలోకి ఎలా వచ్చావు?” అంటూ సంపూని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యాఖ్యలు సంపూర్ణేష్ బాబు అభిమానులను, నెటిజన్లను తీవ్రంగా బాధించాయి. ఒక నటుడిని ఉద్దేశించి అలా మాట్లాడటం తప్పు అంటూ సోషల్ మీడియాలో జర్నలిస్ట్ తీరుపై పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. నెటిజన్లు ఆయనపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ వ్యవహారంపై పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో జర్నలిస్ట్ నాగేంద్ర కుమార్ వెంటనే స్పందించారు. సంపూర్ణేష్ బాబును ఇబ్బంది పెట్టేలా మాట్లాడినందుకు ఆయనకు, అలాగే ఆయన అభిమానులకు బహిరంగంగా క్షమాపణలు తెలియజేశారు.

# సితార బ్యానర్‌లో ధనుష్ కొత్త చిత్రం..

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న తాజా సినిమా ‘డి-56’ (ఐ56) మధురైలో పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది. ‘లబ్బర్ పందు’ సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న యువ దర్శకుడు తమిళరసన్ పచముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాతో ధనుష్ కెరీర్‌లో మరో వైవిధ్యమైన చిత్రం రాబోతుందని అభిమానులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో ధనుష్ సరసన ప్రీతి ముకుందన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, లెజెండరీ కమెడియన్ వడివేలు, టాలెంటెడ్ నటుడు ఎస్.జె. సూర్య మరియు ‘ఉరియడి’ ఫేమ్ విజయ్ కుమార్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భిన్నమైన తరాల నటుల కలయికతో వస్తున్న ఈ భారీ తారాగణంపై సినిమా ఇండస్ట్రీలో ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి యువ సంగీత దర్శకుడు సాయి అభ్యాంకర్ సంగీతం అందిస్తుండటం విశేషం.



PRINTED,PUBLISHED, OWNED BY **ILLIPILLA MOHAN** , D.NO: 6-11-2, KILARI APPALASWAMI STREET, NAGA LAKSHMI NILYAM, ANJANEYAVAGUSENTAR, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH- 520001, **PRINTED AT** GANTYADA APPA RAO D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH-523001

P.H: 92950 03377 ,EMAIL: ushasri2025@gmail.com ,**RNI NO: APTEL/25/A4894**,EDITOR: **ILLIPILLA MOHAN**